# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 14.04.2025

24 క్యారెట్లు 90,215.00 | కిలో వెండి 1,07,000.00 | 32 °C | సంపుటి:3 | సంచిక:173

www.vishalabharati.com


# నేటి నుంచే ఎస్సీ వర్గీకరణ



- మూడు గ్రూపులు.. 59 ఉప కులాలు..
- మొత్తం 15 శాతం రిజర్వేషన్లు
- గ్రూపు-1కు 1 శాతం, గ్రూపు-2కు 9, గ్రూపు-3కు 5 శాతం
- ప్రాధాన్య క్రమంలో ఉద్యోగ ఖాళీల భర్తీ
- కేబినెట్ సబ్ కమిటీ తుది సమావేశం
- నేడు 11 గంటలకు జీవో జారీ
- వర్గీకరణ అమలుచేయనున్న మొదటి రాష్ట్రంగా తెలంగాణ
- గతం కంటే భారీగా పెరిగిన ఎస్సీ జనాభా
- అందరి హక్కులు కాపాడతామన్న మంత్రి ఉత్తమ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** .జీఓ మొదటి కాపీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేయనున్నట్లు తెలిపారు. సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు దామోదర రాజనరసింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్, వన్ మ్యాన్ కమిషన్‌కు నాయకత్వం వహించిన రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్, సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, లా సెక్రటరీ తిరుపతి ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా వర్గీకరణ అమలు మార్గదర్శకాలను కమిటీ క్షుణ్ణంగా సమీక్షించి, జీవో జారీ చేయడానికి తుది ఆమోదం తెలిపింది.ఏప్రిల్ 14న ఈ చట్టం అమల్లోకి వస్తే సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత ఎస్సీ ఉప వర్గీకరణను అమలు చేసిన రాష్ట్రంగా దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలుస్తుంది. షెడ్యూల్డ్ కులాలకు ప్రస్తుతం ఉన్న 15% రిజర్వేషన్లను హేతుబద్ధీకరించడం ఈ చట్టం లక్ష్యం. 59 ఎస్సీ ఉప కులాలను మూడు గ్రూపులుగా విభజించారు. పరస్పర వెనుకబాటుతనం ఆధారంగా గ్రూప్Iలో 15 అత్యంత వెనుకబడిన వర్గాలు ఉన్నాయి. ఎస్సీ జనాభాలో వీటి శాతం 3.288%. వీరికి 1% రిజర్వేషన్లు కేటాయించారు. అలాగే గ్రూప్IIలో 18 మధ్యస్తంగా ప్రయోజనం పొందిన కులాలను ఉంచారు. వీరి జనాభా 62.74%. వారికి 9% రిజర్వేషన్లు కేటాయించారు. ఇక గ్రూప్IIIలో 26 సాపేక్షంగా మెరుగైన వర్గాలు ఉండగా.. వీరి జనాభా 33.963% ఉంది. వీరికి 5% రిజర్వేషన్ కల్పించారు.

ఎస్సీ వర్గంలో క్రిమీలేయర్‌ను ప్రవేశపెట్టాలన్న కమిషన్ సిఫార్సును కూడా కేబినెట్ సబ్ కమిటీ తిరస్కరించింది. ఆర్థిక ప్రమాణాల ఆధారంగా ఏ ఉప సమూహాన్ని

..మిగతా 2 లో

# వందేళ్ల భూ భారతి



- 3 మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్
- ప్రారంభించనున్న సీఎం రేవంత్
- విశ్వసనీయ సంస్థకు నిర్వహణ బాధ్యత
- సామాన్యులకు అర్థమయ్యేలా ఉండాలి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు
- ప్రజల భూములకు భూభారతితో భరోసా
- ధరణిలో అక్రమాలపై ఫోరెన్సిక్ విచారణ
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ధరణి స్థానంలో కొత్తగా తీసుకువచ్చిన భూ భారతి పోర్టల్ నేటి నుంచి అందుబాటులోకి రానుంది. మొదటగా 3 మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. అనంతరం జూన్ 2న నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తీసుకురానుంది ప్రభుత్వం. సామాన్య రైతులకు కూడా సులభంగా అర్థమయ్యేలా, అత్యాధునికంగా, 100 ఏళ్లపాటు నడిచేలా భూ భారతి వెబ్‌సైట్‌ను రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భూభారతి అమలుపై అధికారులతో మరోసారి తన నివాసంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూభారతి పోర్టల్‌ను సోమవారం జాతికి అంకితం చేయబోతున్నట్లు తెలిపారు. భూభారతి తాత్కాలికం

..మిగతా 2 లో

# సలేశ్వరం జాతరకు పోటెత్తిన భక్తులు



- శ్రీశైలం ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్
- 5 కి.మీ. మేర నిలిచిపోయిన వాహనాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** శ్రీశైలం ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. శ్రీశైలం టోల్ గేట్ నుంచి సాక్షి గణపతి, ముఖద్వారం వరకు భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సుమారు 5 కిలోమీటర్ల మేర రోడ్లపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఘాట్ రోడ్డులో భారీ ట్రాఫిక్ జామ్ కావడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తెలంగాణలో సలేశ్వరం జాతర ఉండటంతో అటు శ్రీశైలం, ఇటు సలేశ్వరం దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. శని, ఆది, సోమ (ఏప్రిల్ 12,13,14) వరుస సెలవులు కావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి భారీగా భక్తులు రావడంతో శ్రీశైలం దారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముందుగా సలేశ్వరం జాతర ముగించుకుని ఆ తర్వాత శ్రీశైలం ఆలయ దర్శనానికి భక్తులు వెళ్లడం

..మిగతా 2 లో

# రేవంత్ పాలనలో హైదరాబాద్ ఆగం





- ఎక్కడి సమస్యలు అక్కడే..తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష
- భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా.. బీజేపీ, కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టాల్సిందే
- రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం
- సన్నాహక సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా.. కాంగ్రెస్, బీజేపీలకు కర్రుకాల్చి వాత పెట్టాల్సిందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా మల్కాజిగిరిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ

..మిగతా 2 లో

# సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం



- గత పాలకులు సన్నబియ్యం ఇవ్వలేదు
- జూన్ 2 నుంచి రాజీవ్ యువ వికాసం అనుమతి పత్రాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సంక్షేమంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. 'పెద్ద సంఖ్యలో ఇన్ని సంక్షేమ పథకాలు ఎలా అమలు చేస్తున్నారని.. అన్ని రాష్ట్రాలూ మనవైపు చూస్తుండటం కాంగ్రెస్ ప్రభుత్వానికి గర్వకారణం' అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిరలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "గత పాలకులు పదేళ్లపాటు సన్నబియ్యం సన్నాయి సంగీతం పాడారు తప్ప ఇవ్వలేదు. రేషన్ దుకాణాల్లో ప్రస్తుతం 90 లక్షల కార్డుల ద్వారా 2.85 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. కొత్తగా వచ్చేవాటితో కలిపి మొత్తం కోటి

..మిగతా 2 లో



# వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

- మేం అధికారంలోకి వస్తే గంటలో రద్దు
- యూపీ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్
- ట్యాంక్‌బండ్‌పై ముస్లిం సంఘాల ధర్నా

..మిగతా 2 లో



# ఢిల్లీ కొంప ముంచిన రనౌట్స్..

- ఓడిపోయే మ్యాచ్‌లో గెలిచిన ముంబై
- బ్యాటింగ్‌లో రాణించిన హార్దిక్ సేన
- 20 ఓవర్లలో 205 పరుగులు
- 193 పరుగులకే ఆలౌట్ అయిన ఢిల్లీ

**విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:** ఐపీఎల్ లో ఆదివారం (ఏప్రిల్ 13) ముంబై ఇండియన్స్ థ్రిల్లింగ్ విక్టరీ కొట్టింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ పై 12 పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. ఒక దశలో ఓటమి ఖాయమనుకున్న హార్దిక్ సేన అద్భుతంగా ఆడి మ్యాచ్ గెలవడం

..మిగతా 2 లో

# జానారెడ్డిది ధృతరాష్ట్రుడి పాత్ర




- నాకు మంత్రి పదవి రాకుండా అడ్డుపడుతున్నారు
- జానా లేఖతోనే మంత్రివర్గ విస్తరణ ఆలస్యం
- నేను అర్హుడినను కుంటేనే మంత్రి పదవి ఇవ్వాలి
- రిజర్వేషన్ కోటాలో కాదు.. మాటిచ్చారనీ కాదు
- అధిష్ఠానం ఇస్తానంటే కొందరికి చెమటలు పడ్తున్నయ్..
- పదవి కోసం అడుక్కునే స్థితిలో లేను
- అన్నదమ్ములిద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పా?
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ధర్మరాజులా ఉండాల్సిన జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్రను పోషిస్తున్నారని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి రాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కొందరు కీలక నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. 16 నెలలుగా మంత్రివర్గ విస్తరణ జరగకపోవడంతో పదవులన్నీ ఖాళీగా ఉన్నాయని, మంత్రి పదవులు ఇచ్చే సమయంలో మాజీ మంత్రి జానారెడ్డి అధిష్ఠానానికి ఉత్తరం రాయడంతో విస్తరణ జాప్యం అవుతోందన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, నల్లగొండ జిల్లా చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు హాజరైన ఆయన మాట్లాడారు. కొందరు నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, జానారెడ్డి తన సొంత ఉమ్మడి నల్లగొండ జిల్లాను

..మిగతా 3 లో



# రూ.10 లక్షల కోట్లతో రహదారుల అభివృద్ధి

- వచ్చే రెండేళ్లలో అభివృద్ధి ప్రణాళికలు
- కేంద్ర మంత్రి గడ్కరీ వెల్లడి

..మిగతా 3 లో

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సోమవారం,
14.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# వందేళ్ల భూ భారతి

మొదటి పేజీ తరువాయి



కాదని.. కనీసం వంద సంవత్సరాల పాటు ఉంటుందని అన్నారు. భూభారతి వెబ్‌సైట్ సైతం అత్యాధునికంగా ఉండాలని తెలిపారు. భద్రతాపరమైన సమస్యలు రాకుండా పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. భద్రత కోసం ఫైర్‌వాల్స్ ఏర్పాటు చేసి, నిర్వహణను విశ్వసనీయ సంస్థకు అప్పగించాలని అధికారులకు సూచించారు. భూ భారతి పైలట్ ప్రాజెక్ట్‌గా మూడు మండలాలను ఎంపిక చేసి, వాటిలో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సదస్సుల ద్వారా భూ భారతి పోర్టల్ గురించి రైతులు, ప్రజలకు సమగ్రంగా వివరించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం తర్వాత, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలంలో ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. భూ భారతి పోర్టల్ సరళమైన, సులభంగా అర్థమయ్యే భాషలోనే ఉండాలని. ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనల ఆధారంగా దానిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీఎం రేవంత్ తెలిపారు.

**ప్రజల భూములకు భరోసా..**

గత ప్రభుత్వం మాదిరి హడావిడిగా, తప్పుల తోకాకుండా ఎంతో శ్రమించి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని.. ప్రజల భూములకు భద్రత, భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి ఇకపై ఉండదని.. నూతన రెవెన్యూ చట్టం భూభారతి 2025 సోమవారం నుంచి అమలులోకి వస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మూడు జిల్లాల్లోని మూడు మండలాల్లో పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేసి సమస్యల్ని పరిష్కరిస్తామని.. జూన్ 2వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని ఆయన వివరించారు. భూభారతి పోర్టల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. ఆదివారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తెచ్చిన ధరణి పోర్టల్ మాదిరిగా ఇది మూడు, నాలుగేళ్లకు పరిమితం కాదు. భవిష్యత్తులో ఏ సీఎం వచ్చినా అమలు చేసేలా పారదర్శకంగా రూపొందించాం. భూభారతిని రెఫరెండంగా తీసుకుని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తాం. గత ప్రభుత్వ హయాంలో ధరణితో కొల్లగొట్టిన భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాం. ఆ వివరాల్ని త్వరలోనే ప్రజలకు వెల్లడిస్తాం. భూభారతిపై ఎవరైనా ఫేక్ ప్రచారం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. కొందరు కావాలనే ఆటంకాలు కల్పించే ప్రయత్నాలు చేయొచ్చు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలో రైతుల భూముల రక్షణ బాధ్యత ప్రభుత్వానిదే. ఎవరూ ఆందోళన చెందొద్దు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే ధరణిని బంగాళాఖాతంలో వేసి, అందరికీ ఆమోదయోగ్యమైన భూభారతి చట్టాన్ని తీసుకొస్తున్నాం. ఇందులో రెవెన్యూ మంత్రిగా భాగస్వామిని అయినందుకు నా జన్మ ధన్యమైంది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మూడు మండలాల్లో భూములపై ప్రజల నుంచి మాన్యువల్‌గా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తాం. జూన్ 2కల్లా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తాం. పైలట్ మండలాలకు నేను వెళ్తా. ఇతర మంత్రులూ పర్యటిస్తారని మంత్రి పొంగులేటి తెలిపారు.

# రేవంత్ పాలనలో హైదరాబాద్ ఆగం

మొదటి పేజీ తరువాయి



భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా.. తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా.. హైదరాబాద్‌లో ఒక్క అభివృద్ధి పనిని ప్రారంభించలేదన్నారు. తెలంగాణపై కేసీఆర్‌కు ఉన్న కడుపు నొప్పి..ప్రేమ ఢిల్లీ పార్టీలకు ఉంటుందా అని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరంలో 16 సీట్లు గెలిపించి హైదరాబాద్ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకున్నారని చెప్పారు. మంచి నాయకుడు ఉంటే మంచి జరుగుతుందని గుర్తించి.. భవిష్యత్‌లో మోసపోవద్దన్నారు.

**నగరంలో ఎక్కడి సమస్యలు అక్కడే**

రేవంత్ పాలనలో హైదరాబాద్ అంతా ఆగమైపోయిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మోరీల్లో పూడికలు తీయకపోతే మోరీల్లో కూర్చుంటున్నారని, శ్మశానవాటికను డంపింగ్ యార్డ్ చేస్తుంటే డంపింగ్ యార్డ్‌లో కుర్చుంటూ.. ప్రభుత్వాన్ని ప్రజల సమస్యలు పరిష్కరించాలని నిలదీస్తున్నారన్నారు. హైదరాబాద్ అంతటా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, ప్రజలు ఇది గమనించాలన్నారు. సన్నాహక సభకు ఎర్రటి ఎండలో హాజరైన మహిళలకు ధన్యవాదాలని కేటీఆర్ అన్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్‌ను ఆశీర్వదించేందుకు వచ్చిన వారికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభకు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రజతోత్సవ సన్నాహక భకు భారీ సంఖ్యలో తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులకు ధన్యావాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమంలో తెలంగాణ ఆదర్శం

మొదటి పేజీ తరువాయి




కార్డుల ద్వారా 3.10 కోట్ల మంది లబ్ధి పొందుతారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ రేషన్‌లో సన్నబియ్యం పంపిణీ చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధత, అంకితభావానికి ఈ పథకం నిదర్శనం. నిరుద్యోగుల కోసం రూ.6 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పేరిట నూతన స్వయం ఉపాధి పథకాన్ని ప్రవేశపెట్టాం. మూడు నుంచి వారం రోజులపాటు శిక్షణ ఇచ్చి ఈ పథకాల గ్రౌండింగ్ పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం. జూన్ 2 నుంచి 9 వరకు రాజీవ్ యువ వికాసం అనుమతి పత్రాలు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేస్తాం.

గత పాలకులు రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి అప్పగించారు. వాటన్నింటినీ సరిచేసుకుంటూ, ప్రజలకు సంక్షేమం అందించడంలో ఎక్కడా వెనక్కి తగ్గడంలేదు. రైతు రుణమాఫీ కోసం రూ.21 వేల కోట్లు, రైతు భరోసాకు రూ.18 వేల కోట్లు, సన్నధాన్యం బోనస్‌కు రూ.2,675 కోట్లు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ కోసం రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తున్నాం. నిరుద్యోగ యువతకు ఏడాదిలో 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేశాం. మరో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి జ్యాబ్ క్యాలెండర్ విడుదల చేశాం" అని భట్టి వివరించారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, తెలంగాణ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# సలేశ్వరం జాతరకు పోటెత్తిన భక్తులు

మొదటి పేజీ తరువాయి



అనవాయితీ. ఇందులో భాగంగా సలేశ్వరం నుంచి శ్రీశైలం వెళుతున్న క్రమంలో భారీ ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. సుమారు 5 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గరవుతున్నారు. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు.

# పాలకుర్తి సమ్మక్క సారక్కలు ఎలా ఉన్నారు..

- చెల్లి యశస్విని రెడ్డి బాగున్నవా..
- అక్క ఝాన్సీ రెడ్డి బాగున్నవా..
- అడబిడ్డలకు సీఎం రేవంత్ రెడ్డి ఆత్మీయ పలకరింపు
- పాలకుర్తి అభివృద్ధికి రూ.50 కోట్లివ్వండి
- నిధుల కోసం సీఎంకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అభ్యర్థన
- సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూల స్పందన వ్యక్తం చేశారు. తొర్రురు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు నిధుల కోసం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సీఎంకు విజ్ఞప్తి చేయగా ఆయన అనుకూలంగా స్పందించారు. ఆదివారం నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి. ఈ సందర్భంగా పాలకుర్తి నియోజకవర్గంలోని అభివృద్ధి ప్రాజెక్టులు, ముఖ్యంగా తొర్రురు మున్సిపాలిటీ అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు ఎమ్మెల్యే. తొర్రురు పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి TUFIDC (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) నిధుల ద్వారా రూ.50 కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్‌కు వినతి పత్రం ఇచ్చారు.

పట్టణంలో రోడ్ల విస్తరణ, డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధి, వీధిదీపాల స్థాపన, పార్కులు, నీటి సరఫరా, ఇతర మౌలిక అవసరాల కోసం ఈ నిధులు అత్యవసరమని వివరించారు. ఈ అభ్యర్థనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించనున్నట్లు హామీ ఇచ్చారు. సీఎంని కలిసిన వారిలో వరంగల్ మాజీ జడ్పీ చైర్మన్ లకవత్ ధన్వంతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డా, లక్ష్మీనారాయణ, తదితరులుఉన్నారు.



# వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధం

- మేం అధికారంలోకి వస్తే గంటలో రద్దు
- యూపీ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్
- ట్యాంక్‌బండ్‌పై ముస్లిం సంఘాల ధర్నా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణల చట్టం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, ఇది 14, 25, 26 ఆర్టికల్లను పూర్తిగా ఉల్లంఘించడమే అవుతుందని వక్తలన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహ కూడలిలో ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం భారీ ధర్నా నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి ముస్లింలు భారీ ఊరేగింపుతో ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన యూపీ కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ మాట్లాడుతూ.. 'మీరేమీ మహారాజులు కాదు.. ఇష్టారాజ్యంగా దేశాన్ని పాలించడానికి.. రేపు మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గంటలోపు ఆ చట్టాన్ని రద్దు చేస్తాం. భాజపా, ఆ పార్టీ మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తప్ప.. ఇతర రాష్ట్రాల్లో ఈ వక్ఫ్ చట్టం అమలు కాదు.. కానివ్వబోం.. ఏం చేస్తారో చేసుకోండి. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాలరాస్తూ.. రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారు. ప్రతి ముస్లిం పిల్లాడి చేతిలో కంప్యూటర్ చూడాలనుకుంటున్నానని చెప్పిన ప్రధాని మోదీ.. మదర్సాలకు తాళాలు వేస్తున్నారు. యువతరం కళ్లు తెరవాలి. రేపటి మీ భవిష్యత్తును కాపాడుకోవాలి' అని పిలుపునిచ్చారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. మోదీ వక్ఫ్ సవరణ చట్టం కేవలం అదానీ, అంబానీల కోసమే తీసుకొచ్చారని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వక్ఫ్ సవరణ చట్టాన్ని తొలగించడం ఖాయమన్నారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, తెలంగాణ వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, టెమ్రీస్ వైస్ ఛైర్మన్ ఫహీమ్ ఖురేషీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ ఖుస్రోపాషా, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఎంఏ ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ కొంప ముంచిన రనౌట్స్..

మొదటి పేజీ తరువాయి



విశేషం. చివర్లో ఒత్తిడి తట్టుకోలేక ఢిల్లీ వరుసగా రనౌట్ లు కావడం వారి కొంప ముంచింది. మొదట బ్యాటింగ్ లో అద్భుతంగా రాణించిన హార్దిక్ సేన.. కీలక సమయంలో అద్భుతమైన బౌలింగ్ తో మ్యాచ్ గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌట్ అయింది.

206 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ కు తొలి ఓవర్ తొలి బంతికే షాక్ తగిలింది. ఓపెనర్ జేక్ ఫ్రేజర్‌మెక్‌గుర్క్ తన పేలవ ఫామ్ ను కొనసాగిస్తూ డకౌటయ్యాడు. ఏ వికెట్ ఆనందం ముంబైకి ఎంతో సేపు మిగలలేదు. మూడో స్థానంలో ఇంపాక్ట్ సబ్స్టిట్యూట్ గా వచ్చిన కరుణ్ నాయర్ (40 బంతుల్లో 89:12 ఫోర్లు, 5 సిక్సర్లు) ఓ రేంజ్ లో చెలరేగాడు. ముఖ్యంగా పవర్ ప్లే లో దంచి కొట్టాడు. నాలుగో ఓవర్ లో బుమ్రా బౌలింగ్ లో రెండు ఫోర్లు బాదిన కరుణ్.. ఆరో ఓవర్లో బుమ్రాను ఉతికారేశాడు. రెండు సిక్సులు, ఒక ఫోర్ తో ఏకంగా 18 పరుగులు రాబట్టాడు. కరుణ్ బ్యాటింగ్ తో ఢిల్లీ 6 ఓవర్లలో వికెట్ నష్టానికి 72 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. మరో ఎండ్ లో అభిషేక్ పోరెల్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో ఢిల్లీ స్కోర్ బోర్డు వేగంగా ముందుకు కదిలింది. 10 ఓవర్లలోనే వికెట్ నష్టానికి 113 పరుగులు చేసింది. ఈ క్రమంలో కరుణ్ 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసుకున్నాడు. విజయం దిశగా వెళ్తున్న ఢిల్లీ ఒక్కసారిగా కుప్పకూలింది. స్వల్ప వ్యవధిలో అభిషేక్ పోరెల్.. ఆ వెంటనే సెంచరీకి చేరువలో ఉన్న కరుణ్ నాయర్ 87 పరుగుల వద్ద ఔటయ్యారు. మిడిల్ ఆర్డర్ లో స్టబ్స్(1), అక్షర్ పటేల్(9) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఆదుకుంటాడనుకున్న రాహుల్ 15 పరుగులు చేసి స్వీప్ షాట్ ఆడి ఔటయ్యాడు.దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ ఒకదశలో వికెట్ నష్టానికి 119 పరుగులు చేసిన ఆ జట్టు 160 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. కరణ్ శర్మ మూడు వికెట్లు తీసి ఢిల్లీని దెబ్బ కొట్టాడు. చివర్లో అశుతోష్ శర్మ పోరాడినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఒత్తిడిలో వరుసగా మూడు రనౌట్ లతో మ్యాచ్ ను చేజార్చుకుంది. ముంబై బౌలర్లలో కరణ్ శర్మ మూడు వికెట్లు తీసుకున్నాడు. సాంట్నర్ రెండు వికెట్లు పడగొట్టాడు. దీపక్ చాహర్, బుమ్రా తలో వికెట్ తీసుకున్నారు.

ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ భారీ స్కోర్ చేసింది. తిలక్ వర్మ (33 బంతుల్లో 59: 6 ఫోర్లు, 3 సిక్సర్లు) మెరుపు హాఫ్ సెంచరీకి తోడు.. రికెల్ టన్ (41), సూర్య కుమార్ యాదవ్ (40), నమన్ ధీర్ (38) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. తిలక్ వర్మ టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఢిల్లీ బౌలర్లలో విప్రజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. ముకేశ్ కుమార్ కు ఒక వికెట్ దక్కింది.

# నేటి నుంచే ఎస్సీ వర్గీకరణ

మొదటి పేజీ తరువాయి



మినహాయించకుండా సమాన ప్రయోజనాలను నిర్ధారించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న ఏ ప్రయోజనాలను నీరుగార్చబోమని, అన్ని ఎస్సీ వర్గాల హక్కులను కాపాడుతూ న్యాయాన్ని పెంపొందించడానికి వర్గీకరణ రూపొందించబడిందని ఆయన హామీ ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీలకు ప్రస్తుతం 15% రిజర్వేషన్లు అమలులో ఉన్నాయని అన్నారు. తెలంగాణలో ఎస్సీ జనాభా దాదాపు 17.5% పెరిగిందని పేర్కొన్నారు. 2026 జనాభా లెక్కల డేటా అందుబాటులోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం రిజర్వేషన్లను పెంచే విషయాన్ని పరిశీలిస్తుందని ఆయన అన్నారు.

**చట్టపరమైన మద్దతు..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లేదా తెలంగాణలో ఎన్నడూ నెరవేరని దశాబ్దాల నాటి డిమాండ్‌ను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గతంలో అనేక ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా తీర్మానాలు ఆమోదించినప్పటికీ, ఎవరూ చట్టపరమైన మద్దతుతో దానిని అమలు చేయలేదని తెలిపారు. 1999 నుండి జరిగిన ప్రతి అసెంబ్లీ సమావేశంలో ఈ అంశంపై చర్చించినప్పటికీ పరిష్కారం కాలేదని, రాజకీయ సంకల్పం చూపించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. సామాజిక న్యాయం పట్ల కాంగ్రెస్ పార్టీ నిబద్ధతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలనే నిర్ణయానికి జాతీయ స్థాయిలో బలమైన నాయకత్వం మద్దతు ఇచ్చిందని, రాహుల్ గాంధీ తన ఎన్నికల ప్రచారంలో ఈ లక్ష్యానికి మద్దతును పునరుద్ఘాటించారని అన్నారు. ఈ చట్టాన్ని మార్చి 18న తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించగా, ఆ తర్వాత గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు.

**సుప్రీం తీర్పు వచ్చిన రోజే ప్రకటన**


ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్రాలే నిర్ణయం తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు గతేడాది ఆగస్టు 1న తీర్పు ఇచ్చింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అదే రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. సెప్టెంబర్ 12న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవి సభ్యులుగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉపసంఘం సూచన మేరకు 2024 అక్టోబర్ 11న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌తో ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 60 రోజులో కమిషన్ నివేదిక ఇవ్వాలని కోరింది. తర్వాత గడువును ఈ ఏడాది ఫిబ్రవరి 10 వరకు పొడిగించింది. కమిషన్ 2011 జనాభా లెక్కల ఆధారంగా పరిశీలన జరిపి.. ఫిబ్రవరి 3న మంత్రివర్గ ఉపసంఘానికి నివేదిక అందజేసింది. కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీలను 3 గ్రూపులుగా వర్గీకరించి, రిజర్వేషన్‌ను విభజిస్తున్నట్టు ఫిబ్రవరి 4న అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
14.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## జానారెడ్డిది ధృతరాష్ట్రుడి పాత్ర

మొదటి పేజీ తరువాయివదిలిపెట్టి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవులను ఇవ్వాలని అనడం విచిత్రంగా ఉందన్నారు. తాను మంత్రి పదవి కోసం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడలేదని, పైరవీకారులను పక్కన పెట్టాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఏ మంత్రి గెలిపించారని ప్రశ్నించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చాలామంది మంత్రులను రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా పెట్టిందని, భువనగిరి పార్లమెంట్‌కు మాత్రం మంత్రి ఇన్‌చార్జిగా రాలేదని, ఒక ఎమ్మెల్యేను పార్టీ ఇన్‌చార్జిగా పెట్టిందని పేర్కొన్నారు. తనకు మంచి పేరు, గెలిపించే శక్తి లేకపోతే ఎందుకు ఇన్‌చార్జిగా పెట్టారని ప్రశ్నించారు. గెలిపించే సత్తా ఉందనే కదా తనకు బాధ్యత అప్పగించారని చెప్పారుచామలను 2.25 లక్షల మెజార్టీతో గెలిపించా'ఇచ్చిన మాటను నిలబెట్టుకునే బాధ్యత ఎవరిది? మీరు ఇన్‌చార్జిగా పెడితే అభ్యర్థిని గెలిపించినం కదా.. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, మెదక్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలిచిందా? ఈ మంత్రులంతా ఎక్కడికి పోయిండ్రు.



## అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

- ఫార్మాసిటీని రద్దు చేశాం
- మండలంలోని పలు గ్రామాల్లో రూ. 75 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు
- యాచారం మండలం అభివృద్ధి చెందాలంటే ఫోర్త్ సిటీని తీసుకొస్తాం
- ఫోర్త్ సిటీ వల్ల ఉపాధి, ఉద్యోగ అవకాశాలు

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి :**

యాచారం మండల పరిధిలోని మల్కిస్ గూడ, ధర్మన్నగూడ, నందివనపర్తి, గ్రామాలలో రూ. 75 లక్షలతో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజ్, యూత్ బిల్డింగ్, బీసీ కమ్యూనిటీ హాల్, అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం నందివ్నపర్తిలోని ఓంకారేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీని రద్దుచేసి దాని స్థానంలో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి హైటెక్ సిటీ, హైదరాబాద్, సికింద్రాబాద్ ఈ మూడింటిని మించినదిగా ఫోర్త్ సిటీని నిర్మించబోతున్నట్లు వివరించారు. స్కిల్ యూనివర్సిటీలు, ఐటీ కంపెనీలు, ఇతర పరిశ్రమలతో యువతకు లక్షల్లో ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మాసిటీకి భూములు ఇవ్వద్దని రైతులకు చెప్పినట్లు గుర్తు చేశారు. ఇచ్చిన భూములను ఏమి చేయలేమని చెప్పినట్లు ఇవ్వని భూముల జోలికి రామని తేల్చి చెప్పారు. రైతుల సమ్మతంతో మార్కెట్ రేటు ప్రకారం కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్ రెడ్డి , నంది వనపర్తి మాజీ సర్పంచ్ కంబాలపల్లి ఉదయ శ్రీ , యాచారం మాజీ ఎంపీపీలు రాచార్ల వెంకటేశ్వర్లు , బీఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్ర శేఖర్ రెడ్డి , ముదెడ్ల వెంకట్ రెడ్డి , ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి , ఇబ్రహీంపట్నం మాజీ జడ్పిటిసి మహిపాల్ పాల్గొన్నారు.






## దేశ సంపద సృష్టిలో కార్మికుల శ్రమ ఎనలేనిది

- కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం
- ఐఎన్ టియుసి అఖిల భారత అధ్యక్షులు సంజీవ్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

దేశ సంపద సృష్టిలో కార్మికుల శ్రమ ఎనలేనిదని, కార్మికుల హక్కుల కోసం ఐఎన్టియుసిది రాజీలేని పోరాటం అని అఖిల భారత ఐఎన్టియుసి అధ్యక్షులు డా. జీ. సంజీవ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్ చెరులోని టీజీఐఐసీ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా ఐఎన్ టియుసి అధ్యక్షులు కొల్కురి నరసింహారెడ్డి అధ్యక్షతన కిర్బీ కార్మికులతో జనరల్ బాడీ నిర్వహించారు. కార్యక్రమానికి అఖిల భారత ఐఎన్ టియుసి, కిర్బీ కార్మిక సంఘం ఐఎన్ టియుసి అధ్యక్షులు డా. జీ. సంజీవ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచ కార్మికుల హక్కుల కొరకు గత 70 సంవత్సరాలుగా రాజీలేని పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. దేశ సంపదను, కార్మికుల హక్కులను ప్రధాని మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో, ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలో తనకు కార్మికులతో విడదీయలేని అనుబంధం ఉన్నదన్నారు. కిర్బీ పరిశ్రమ కార్మికులు ఐక్యంగా ఉండి ఐఎన్టీయూసీకి అవకాశం ఇస్తే మంచి వేతన ఒప్పందం, రిటైర్మెంట్ బెనిఫిట్, బోనస్ కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. వచ్చే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్ టి యుసిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్టియుసి ఉపాధ్యక్షులు రెహమాన్, ప్రధాన కార్యదర్శి ఆర్.డీ చంద్రశేఖర్, ఐఎల్ఓ గవర్నింగ్ బాడీ సభ్యులు సత్యజిత్ రెడ్డి, ఆర్డిన్స్ ఫాక్టరీ నాయకులు జనార్ధన్ రెడ్డి, రవీందర్ గౌడ్, కొండల్ రెడ్డి, మనికిషన్, కిర్బి నాయకులు విజయ్, జాన్సన్, రామారావు, వివిధ పరిశ్రమల నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## రూ.10 లక్షల కోట్లతో రహదారుల అభివృద్ధి

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:**

దేశవ్యాప్తంగా రహదారుల అభివృద్ధికి వచ్చే రెండేళ్లలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇందులో భాగంగా ప్రధానంగా ఈశాన్య భారత్‌లో రోడ్ల విస్తరణపై దృష్టి సారించనున్నట్లు చెప్పారు. అమెరికా రోడ్లకు దీటుగా ఆ ప్రాంతంలో రహదారులను తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. 'పీటీఐ' వార్తాసంస్థతో ముఖాముఖిలో తాజాగా ఆయన ఈ మేరకు పలు అంశాలపై మాట్లాడారు. "ప్రపంచంలోని అత్యుత్తమ మౌలిక సదుపాయాలకు సరితూగేలా మన దేశంలో మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని మేం కృషి చేస్తున్నాం. మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, ఢిల్లీ సహా అన్ని రాష్ట్రాల్లో ఈ మేరకు పనులు జరుగుతున్నాయి. రూ.3,73,484 కోట్లతో ఈశాన్య రాష్ట్రాల్లో 784 హైవే ప్రాజెక్టులను చేపట్టబోతున్నాం. వాటి పొడవు 21,355 కిలోమీటర్లు" అని గడ్కరీ వివరించారు. నాగ్‌పుర్‌లో రూ.170 కోట్ల వ్యయంతో ఒక భారీ శీఘ్ర రవాణా పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 135 సీట్ల బస్సు.. కాలుష్యరహిత ఇంధన వనరులతో నడుస్తుందని చెప్పారు. 2014 మార్చి నాటికి దేశవ్యాప్తంగా 91,287 కిలోమీటర్ల మేర ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ పొడవు.. ప్రస్తుతం 1,46,204 కిలోమీటర్లకు పెరిగినట్లు వెల్లడించారు. 202425లో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ 5,614 కిలోమీటర్ల జాతీయ రహదారులను నిర్మించిందని గడ్కరీ తెలిపారు.





## అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శం

- అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం
- నిమ్న కులాల అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన అంబేద్కర్
- సమత సైనిక్ దళ్ జాతీయ కన్వీనర్ మార్షల్ దిగంబర్ కాంబ్లె
- నందివనపర్తి గ్రామంలో జై భీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జ్ఞాన సభ

**ఇబ్రహీంపట్నం, విశాల భారతి**

రాజ్యాంగ నిర్మాత, దళిత వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితం అందరికీ ఆదర్శనీయమని, బహుజనులంతా సమాజంలో సమానత్వం సాధిస్తూ విద్యా ఉద్యోగం ఆర్థిక అభివృద్ధి చెందినప్పుడే అంబేద్కర్ ఆశయాలు నెరవేరుతాయని సమత సైనిక్ దళ్ జాతీయ కన్వీనర్ మార్షల్ దిగంబర్ కాంబ్లె అన్నారు. ఆదివారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో జై భీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జ్ఞాన సభ యూత్ సిల్వర్ జూబ్లీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వైభవంగా యూత్ అధ్యక్షుడు మరాటి వివేక్ అధ్యక్షతన కమిటీ సంఘం సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దిగంబర్ కాంబ్లె, రేంజర్ల రాజేష్, స్థానిక నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు, మూడెడ్ల వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భం గా ముఖ్య అతిథులు మార్షల్ దిగంబర్ కాంబ్లే మాట్లాడుతూ.. అనగారిన వర్గాల ప్రజలు సామాజిక ఆర్థిక స్వేచ్ఛ సమానత్వం తో ప్రతి ఒక్కరు జీవించాలని అనుక్షణం తపించిన మహనీయుడు అంబేద్కర్ అని అన్నారు. అందుకే భారతదేశంలో ఉన్న అనేక షెడ్యూల్డ్ కులాలను ఒకే జాబితాలో చేర్చి అందరితో సమానంగా జీవించేలా సమాన హక్కులు కల్పించారు అని అన్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా అవసరమైతే రాజ్యాంగాన్ని మార్చే కుట్రకు కొన్ని వర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అంబేద్కర్ కేవలం కొన్ని వర్గాలకు చెందిన వ్యక్తిగా చిత్రీకరించాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలకు అంబేద్కర్ యొక్క స్ఫూర్తిని తన జాతుల కొరకు తను చేసిన కృషిని రాజ్యాంగం యొక్క ప్రఖ్యాతను తరతారాలకు అందించే లక్ష్యంగా అంబేద్కర్ యొక్క భావజాల వ్యాప్తికి మేము చేసే ప్రయత్నం అంబేద్కర్ జ్ఞాన సభ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 25 సంవత్సరాల క్రితం నంది వనపర్తి గ్రామంలోని వెనుకబడిన వర్గాలను చైతన్య పరచాలన్న ఉద్దేశంతో అంబేద్కర్ యొక్క భావజాల భవిష్యత్ తరాలను భాగస్వాములు చేస్తూ సమాజం పట్ల సేవా భావాన్ని కలిగి ఉండేలా కార్యక్రమాలను రూపొందిస్తున్న జై భీమ్ ఎడ్యుకేట్ యూత్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్ని కలగజేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గోరేటి (గొంతుక) రమేష్ కళాబృందం సభలో అద్భుతమైన పాటలతో మైమరిపించారు. జ్ఞానం సమానత్వం సమసమాజ నిర్మాణం కోసం చేయాల్సిన పనులన్నీ పాటల రూపంలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ వ్యవస్థాపకులు ఉపాధ్యాయులు మరాటి యాదయ్య, తాళ్లపల్లి రవికుమార్ , లకమల్ల మారయ్య, హనుమండ్ల కృష్ణ, భర్తాకి జగన్నాథం, బండి మహేష్, ఉపాధ్యాయుల భూపతి దాసు, జై భీమ్ యూత్ సభ్యులు కాలే యాదయ్య, సీనియర్ జర్నలిస్టు మరాటి రవి, భూపతి నాగరాజు, మరాటి గణేష్, పంబాల యాదయ్య, భూపతి గౌతమ్ , బండి అలెగ్జాండర్ ,తెలగమల్ల ప్రశాంత్, గుండె రాఘవేందర్, భూపతి రాములు, మహిళలు భూపతి సువర్ణ, అనిత, ఉమారాణి, లక్ష్మి, పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆదర్శం అంబేద్కర్

ఒక దేశం అభివృద్ధి చెందాలంటే ఆ దేశంలోని మానవ వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి ప్రపంచంలో ఎక్కువ యువత భారతదేశంలోనే ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వారి నైపుణ్యాలకు సరైన అవకాశాలు కల్పించడం ఆయా దేశ ప్రభుత్వాల కనీస బాధ్యత. యువతకు నైపుణ్యాలు పెంచి అవకాశాలు కల్పించాలని భారత రాజ్యాంగంలో పొందుపరిచినగానీ, దాన్ని అమలు పరచడంలో మన ప్రభుత్వాలు వెనుకబడి పోతున్నాయి. అంతటి మహత్తర రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ ను

ప్రపంచమేధావిగా ఐక్యరాజ్య సమితి గుర్తించిన నేపథ్యంలో, తన జీవితమే తన సందేశంగా అంబెద్కర్ చూపడం, తను జీవితంలో పడ్డ కష్టాలు, తన జాతి ప్రజలు పడకూడదనే విషయాన్ని తెలియజేస్తున్నాయి.

భీమ్ రావ్ రాం జి అంబేద్కర్ పుట్టినప్పటి నుండి అగ్ర కులాల చేతిలో ఎన్నో అవమానాలు పడ్డా, జీవితంలో ఎదురైన సవాళ్ళను అధిగమించాడు. బరోడా మహారాజు సహాయంతో, కొలంబియా, లండన్ యూనివర్సిటీలలో ఎన్నో ఉన్నత చదువులు చదివి యావత్ ప్రపంచంలోనే అణగారిన వర్గాలకు ఆదర్శంగా నిలిచాడు. మహారాష్ట్ర లోని మహాద్ చెరువులో అంటరాని కులాలు నీళ్లు తాగరాదనే అగ్రవర్ణ ఆంక్షలకు వ్యతిరేకంగా 1927 లో మహాద్ చెరువు పోరాటానికి నాయకత్వం వహించి, ఆ వర్గాల్లో ఆత్మస్థైర్యాన్ని నింపారు. దేశంలో సామాజిక సమానత్వం లేని కారణంగా, భౌతికంగా పూడ్చలేని కులాల మధ్య అంతరాలను, భావపరంగా విప్లవం రావాలని, మనిషిని ప్రేమించే స్వభావం కలిగి, ప్రతిభను ఆహ్వానించే విశాల హృదయం కావాలని ఆకాంక్షించారు. భారతీయులందరు జ్ఞానవంతులుగా, నూతన ప్రపంచాన్ని అవిష్కరించగలిగే ప్రతిభావంతులుగా ఉండాలని ,ప్రపంచంలోనే అతిపెద్ద లిఖితపూర్వక రాజ్యాంగాన్ని రాశారు. దేశంలో ఏ ప్రభుత్వం ఏర్పడ్డా, రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కి, రాజ్యాంగంలో గల అవకాశాలను అలుసుగా చేసుకొని, వాటిని వివిధ రాజకీయ పార్టీలు వారి స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే ఉపయోగించుకున్నారు తప్ప, ప్రజా ప్రయోజనాల కోసం ఏమాత్రం పట్టించుకోలేదు. అందుకే భారతదేశానికి స్వాతంత్యం వచ్చి 78 సంవత్సరాలు వచ్చినా, దేశంలో ఇంకా అసమానతలు, అవిద్య, అంటరానితనం, అక్రమాలు, అన్యాయాలు, అత్యాచారాలు, కొనసాగుతూనే ఉన్నాయి. దేశంలో ఉన్న ప్రతి భారతీయునికి కూడు, గూడు, గుడ్డ ఉండాలని, సామాజిక వెనుకబాటుకు గురి అయిన ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు విద్యలో, ఉద్యోగంలో, రాజకీయాలలో, ఆర్థిక, వ్యాపార రంగాలలో ఎదగాలని రిజర్వేషన్లు కల్పించి ఆ జాతులు ఉన్నతంగా ఎదగాలని కాంక్షించారు. కానీ, నేటి బహుజనులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారయింది.

ఆర్టికల్ 15లో మత, జాతి, కుల లింగ భేదం లేకుండా, జన్మ స్థాన కారణాలను బట్టి వివక్ష చూపడం నేరం అని చెప్పడం జరిగింది. ఆర్టికల్ 17 ప్రకారం అస్పృశ్యత, అంటరానితనం రద్దు చేయబడింది. అయిన ఇప్పటికీ ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్ లాంటి కొన్ని రాష్ట్రాల్లో వెనుకబడిన జాతులపై అనేక దుశ్చర్యలకు పాల్పడుతున్నారు.

ఇప్పటికి గ్రామీణ భారతదేశంలో అక్షరాస్యత 60 శాతానికి మించలేదు. సగటు భారతీయుని తలసరి ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. భారతదేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రతరం అయింది. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వ ఏర్పాటు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు బడా పెట్టుబడిదారులకు ఆదాయ మార్గాలుగా మారిపోయాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కొంతమంది బి.జె.పి నాయకులు, రిజర్వేషన్ల పై సమీక్ష చేయాలనుకోవడమే కాకుండా రాజ్యాంగాన్ని మార్చాలి అనుకోవడం దురదృష్టకరం. దీన్ని బహుజన నాయకులు వ్యతిరేకించడంతో కాస్త వెనక్కి తగ్గారు. కానీ ఆయా రాష్ట్రాల్లో మతపరమైన దాడులు చేస్తూ భారతదేశంలో లౌకికత్వానికి తూట్లు పొడుస్తున్నాయి.

డా.బి.ఆర్ అంబేద్కర్ ఈ దేశంలో సామాజిక పరివర్తన ద్వారా ఆచరణాత్మక ప్రజాస్వామ్యం నిర్మించడం సాధ్యమని గట్టిగా విశ్వసించారు. విద్యా వ్యాప్తి, విప్లవాత్మక భూ సంస్కరణలు, ఆర్థిక సమానత్వం, సార్వత్రిక వయోజన ఓటు ద్వారా రాజకీయాధికారం తద్వారా సామాజిక మార్పు సాధ్యం అని భావించారు.

.

కానీ, కులాల మధ్య కుమ్ములాటలు, మతాల మధ్య రాజకీయ నాయకుల చిచ్చు, వెరసి బహుజనుల మధ్య అనైక్యతనే వారిని రాజకీయాధికారానికి దూరం చేస్తున్నాయి. మనిషిని మనిషిగా చూడడమే మానవత్వం అని అంబేద్కర్ అన్నారు. అలా కాకుండా సాటి మనుషులను హీనంగా చూస్తూ, పక్షులను, జంతువులను ప్రేమించే విచిత్రమైన సంస్కృతి భారతదేశంలో పెరుగుతుందని, ఇది ఇలాగే కొనసాగితే మానవ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం లేకపోలేదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికి అంబేద్కర్ ను అర్థం చేసుకోవాలంటే తను రాసిన రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవాలి. అది ఇంకా భారతీయుల మనసులలోకి, మెదళ్లలోకి చేరలేదు. అది కేవలం కొంతమంది చేతుల్లో ఆభరణంగానే ఉంది. దీని ప్రతిఫలాల కోసం సామాజిక, సాంస్కృతిక, రాజకీయ ఉద్యమం జరగాలి. అందుకు విద్యావంతులు, మేధావులు, ఉద్యోగస్తులు, రచయితలు భాగస్వామ్యం కావడమే బాబాసాహెబ్ కు మనమిచ్చే నిజమైన నివాళి.



ఎరవెల్లి జగన్

## 16 నుంచి సీఎం రేవంత్ జపాన్ పర్యటన

విశాలభారతి, స్టేట్ బ్యూరో: రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నెల 15వ తేదీ రాత్రి బయలుదేరనున్న ఆయన 16 నుంచి 22 వరకు అక్కడ పర్యటిస్తారు. 23న రాష్ట్రానికి తిరిగి రానున్నారు. ఆయన వెంట ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఐటీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పర్యటనకు వెళుతున్నారు. ఈ బృందం జపాన్‌లోని టోక్యో, మౌంట్‌ఫుజి, ఒసాకా, హిరోషిమాల్లో పర్యటిస్తుంది. పర్యటనలో భాగంగా ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో-2025లో తెలంగాణ పెవిలియన్‌ను సీఎం ప్రారంభించనున్నారు. అలాగే జపాన్‌కు చెందిన ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు తదితరులతో బృందం సమావేశం కానుంది. తెలంగాణలో పెట్టుబడులు, పారిశ్రామిక, సాంకేతిక సహకారంపై ప్రధానంగా చర్చలు జరుపుతుంది. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు, పెట్టుబడులు పెట్టడానికి గల అవకాశాలను, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలను జపాన్ పర్యటనలో ప్రధానంగా వివరించనున్నారు.

# ఎల్కతుర్తి సభకు వేలాదిగా తరలిరావాలి

- రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ
- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



ఆమనగల్లు, విశాలభారతి: ఈనెల 27న వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. కడ్తాల్ మండల కేంద్రంలో ఆదివారం రజతోత్సవ సభ గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా రైతుబంధు, రుణమాఫీ, విద్యుత్ కోతలను వివరించాలని తెలిపారు. మహిళలకు నెలకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు రూ.7 వేలు ఇస్తామని ఎన్నికల్లో అమలు కానీ హామీలను ఇచ్చినట్లు ప్రజలకు తెలపాలని కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎలాంటి హామీ ఇవ్వకుండానే ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని వెల్లడించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు హాజరయ్యేలా ప్రణాళికను తయారు చేసుకోవాలని సూచించారుమోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని కూడా సంపూర్ణంగా అమలు చేయకుండా ఆపసోపాలు పడుతుందని విమర్శించారు. ఈ 15 నెలల కాలంలో రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, సబ్బండ వర్గాలు అనేక కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నీ వర్గాలను మోసం చేసి బూటకపు మాటలతో అరాచక పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాలుగు మండలాల మాజీ జడ్పీటీసీ,ఎంపీపీ పార్టీ అధ్యక్షులు, ఎంపీటీసీ, సర్పంచ్, కో ఆప్షన్ సభ్యులు రైతు సమన్వయ సమితి సభ్యులు సింగిల్ విండో సభ్యులు గ్రామస్థాయి వార్డు సభ్యులు నాయకులు కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# గడపగడపకు జై బాబు జై భీమ్ జై సంవిధాన్

- శ్రీనివాస్ గౌడ్

ఆమనగల్లు, విశాలభారతి: జై బాబు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమం అని టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ చెప్పారు. ఆదివారం ఆమనగల్లు పట్టణం కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ లో మండల అధ్యక్షులు తెల్గమల్ల జగన్ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రజల వద్దకు వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని. అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా, దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించ పరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ, అప్రజస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర చేయడం జరుగుతుందని, ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా గడపగడపకు వెళ్లి పథకాల గురించి వివరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజా ప్రతినిధులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో విచ్చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ గీత నర్సింహా, మాజీ జడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత విజయ్, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి,మాజీ సర్పంచులు సత్యం, నరసింహ , ఆనంద్, సుదర్శన్ బాల్ రెడ్డి, వెంకటేష్, వినోద్ శీను నరసింహ,సురేష్ పాల్గొన్నారు.



# శోభాయమానంగా హనుమాన్ శోభాయాత్ర

- భక్తి పారవశ్యంలో హనుమాన్ స్వాముల నృత్యాలు
- అలరించిన మహిళల కోలాటం
- ప్రత్యేక ఆకర్షణగా ఎత్తిన ధ్వజారోహణ జెండా

భీమదేవరపల్లి, విశాలభారతి: మండలంలోని ముత్తారంలో హనుమాన్ శోభాయాత్ర శోభాయమానంగా, కన్నుల పండువగా జరిగింది. ముత్తారంలో ఇప్పటి వరకు కనీవినీ ఎరుగని రీతిలో సుమారు 10 ఫీట్ల హనుమాన్ విగ్రహంతో, ర్యాలీలో 100 కు పైగా మంది హనుమాన్ భక్తులు పాల్గొన్నారు. అన్ని చోట్లా కాషాయ జెండాలతో, జై శ్రీరామ్ నినాదాలతో అంగరంగ వైభవంగా జరిగిన ఈ హనుమాన్ శోభాయాత్ర ప్రజలను ఎంతగానో అలరించింది. భక్తి పాటలపై హనుమాన్ దీక్ష స్వాములు నృత్యాలు చేస్తూ త్రికూటేశ్వర ఆలయం నుండి ర్యాలీగా ప్రారంభించి, అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ముగించారు. అంతకుముందు ఆలయ పూజారులు కోటేశ్వర చారి చక్రాచారి, అర్చన, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ద్వజారోహణ జెండాను అర్చకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని ముల్కనూర్ ఎస్సై సాయిబాబా జండా ఊపి ప్రారంభించారు. ముత్తారం మహిళ కోలాట బృందం నృత్యాలు పలువురిని అలరించాయి. శోభాయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జైశ్రీరాం జైజై శ్రీరాం రామలక్ష్మణ జానకీ జై బోలో హనుమాన్‌కీ అంటూ భక్తుల నినాదాలతో రామ, హనుమంతుల నామస్మరణ మార్మోగింది. రత్నగిరి, కొప్పూర్, ముల్కనూర్, కొత్తపల్లి తదితర గ్రామాల హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇంటి పన్ను చెల్లించాలి

- కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి: హయత్ నగర్ డివిజన్ లోని సుభద్ర నగర్ కాలనీ సంక్షేమ సంఘం వారు ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు ఉన్నటువంటి ఇంటి పన్ను చెల్లింపు లపై ఉన్న సందేహాలను కార్పొరేటర్ కి వివరించడంతో సంబంధిత అధికారులతో ఈ యొక్క సమావేశంలో పాల్గొన్న కార్పోరేటర్ ప్రస్తుతం జిహెచ్ఎంసి పరిధిలో నిర్వహిస్తున్న GIS సర్వే ఆధారంగానే ఇంటి పన్ను అమలు కావడం జరుగుతుందని కాలనీవాసులకు వివరించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో సంబంధిత అధికారులు నాగయ్య , సుభద్ర కాలనీ అధ్యక్షులు లక్ష్మణ స్వామి , సంక్షేమ సంఘం సభ్యులు , సుబ్రహ్మణ్యం , సోమిశెట్టి నారాయణ , అప్పారావు , నాగేశ్వరరావు , ఫణి కుమార్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# మహనీయుల విగ్రహాల శుద్ధి

సికింద్రాబాద్,విశాలభారతి: బౌద్ధ నగర్ డివిజన్ నందు భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా సత్యనారాయణ, శ్రీనివాస్,నాగమణి నాయకత్వంలో మహనీయులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ల విగ్రహాలకు శుద్ధి చేసారు. అనంతరం పాలతో అభిషేకం చేసి, పూల మాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పరిసర ప్రాంతాలలో శుభ్రం చేశారు. భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు దేశ స్వతంత్రంలో భాగస్వాములైన మహనీయుల అన్ని విగ్రహాలకు శుద్ధి చేసే కార్యక్రమం లో అందరూ భాగస్వాములు కావాలని మహనీయులను స్మరించుకుంటూ దేశభక్తిని అలవర్చుకోవాలని బౌద్ధ నగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తి హర్ష కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు హనుమంతు ముదిరాజ్, కొమురయ్య, సాయ దత్తు, సురేష్,అరవింద్, వనమాల, శ్రీనివాస్,నాగరాణి, నాగమణి, మమత, సుప్రియ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# బంగారు మైసమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఉప్పల దంపతులు

ఎల్బీనగర్ ,విశాలభారతి: నాగోల్ జై పూరి కాలనీలోని నువ్వుల బండ లో గల బంగారు మైసమ్మ టెంపుల్ లో జరిగిన కళ్యాణం కి టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త,ఆయన సతీమణి ఐవిఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న అమ్మవారికి వొడి బియ్యం పోసి పూస్తే మట్టెలు చీర గాజులు అందజేయడం జరిగింది.ఈ సందర్భగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఆ బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. తను దేవాలయాల అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో చంద్ర కళ , సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# సాయిరాం ఎంక్లేవ్ కాలనీ ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ

- పాల్గొన్న కాట సుధా శ్రీనివాస్ గౌడ్

పటాన్ చెరు,విశాలభారతి: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాయిరాం ఎంక్లేవ్ కాలనీలో ముఖద్వారం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం చైర్మన్ సుధాకర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ మున్నా, కాంగ్రెస్ నాయకులు శశిధర్ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం నియోజకవర్గంకు విచ్చేసిన పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ గౌడ్ కి స్వాగతం పలికిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బాటసింగారం రైతు సహకార సంఘం డైరెక్టర్ ముత్యాల రాజశేఖర్ రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు బాలశివుడు గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుడుని అభినందించిన ఎమ్మెల్యే జీఎంఆర్



పటాన్ చెరు,విశాలభారతి: క్రీడాకారుల అభివృద్ధికి ఎల్లప్పుడు సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీకి చెందిన బాడీ బిల్డర్ కె.శ్రీనివాస్ ఇటీవల ముంబైలో నిర్వహించిన నాచురల్ బాడీ బిల్డింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించడం పట్ల ఎమ్మెల్యే అభినందించారు.

# నీటిని విడుదల చేయకుంటే సమస్య తీవ్రం

- కొత్తగూడెం సీఈ లేఖ

కొత్తగూడెం విశాలభారతి: సమ్మక్క సాగర్ నుంచి నీటిని విడుదల చేయకుంటే ఈ నెలాఖరు నుంచి పరిశ్రమలకు, మిషన్ భగీరథ అవసరాలకు నీటి సమస్య తీవ్ర రూపం దాల్చుతుందని కొత్తగూడెం ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్.. ములుగు చీఫ్ ఇంజినీర్‌కు ఈ నెల 4న లేఖ రాశారు. ప్రస్తుతం దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద 0.8 టీఎంసీ నిల్వ ఉందని, తాగు, పారిశ్రామిక అవసరాలకు ఈ నెలాఖరు వరకు సరిపోతాయని పేర్కొన్నారు. ఇక్కడి నుంచే మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్, భద్రాద్రి పవర్ ప్లాంట్, సింగరేణి కాలరీస్, ఐటీసీ తదితర భారీ పరిశ్రమలకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుందని వివరించారు. జూన్ ఆఖరు వరకు రోజుకు 600 క్యూసెక్కులు విడుదల చేయాలని కోరారు. అయితే సమ్మక్క సాగర్‌కు వచ్చే ప్రవాహం పూర్తిగా తగ్గిపోవడంతో నీటిని విడుదల చేసే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి నీటిని తీసుకొనే పరిశ్రమలు, తాగునీటి అవసరాలకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది.

## గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి.



**తిరుమలగిరి, విశాలభారతి:**

తిరుమలగిరి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న డేగావాత్ రమేష్ హెడ్ కానిస్టేబుల్ ఆదివారం నాడు మధ్యాహ్నం 1. 20 నిమిషాల సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఆదివారం నాడు విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రమేష్ కు గుండెపోటు రావడంతో పోలీస్ సిబ్బంది సిపిఆర్ నిర్వహిస్తూ,పోలీసు వాహనంలో మున్సిపల్ కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించాడు, రమేష్ కు ఒక కూతురు,కుమార్తె ఉన్నారు. కాగా రమేష్ మృతి పట్ల తిరుమలగిరి ఎస్సై వెంకటేశ్వర్లు తోపాటు పోలీస్ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

# నాకు మంత్రి పదవి ఇస్తే ఒక బాధ్యతగా వ్యవహరిస్తా

▸ **కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎమ్మెల్యే**



**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. తదనంతరం వారు మాట్లాడుతూ మంత్రి పదవి పై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. పదవి అనేది అలంకారం కాదు ఒక బాధ్యత అని ఆ బాధ్యతను గుర్తించి ప్రజలకు మంచి చేయాలి.రాబోయే రోజుల్లో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ పరిధిని పెంచి రైతులకు ఇంకా మంచి చేసే కృషి చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవాలన్న సంకల్పంతోటి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తుంది. ప్రభుత్వ ఉద్యోగులకు జీతం ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నపుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.గతంలో పాలించిన పార్టీ ఒక కుటుంబ పార్టీ, రాచరికంతో కొనసాగిన పార్టీ,వారికి వంగి వంగి దండాలు పెట్టిన వారికె మంత్రి పదవులు ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఒక జాతీయ పార్టీ, బడుగు బలహీన వర్గాల పార్టీ అని కరెంటు గురించి మాట్లాడే అర్హత ఏ పార్టీకి లేదు. కాంగ్రెస్ అంటేనే కరెంటు కరెంటు అంటేనే కాంగ్రెస్ పార్టీ.రైతు రుణమాఫీ కొంతమంది రైతులకు ఇవ్వాల్సి ఉంది అది వాస్తవమే. డబల్ బెడ్ రూమ్ పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పేదలను మోసం చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోనే ఇందిరమ్మ ఇళ్లను కట్టిస్తుంది.పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పేద ప్రజలు అనేక ఇబ్బందులు పాలయ్యారు. మునుగోడు నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి నీరు అందించే బాధ్యత రాజగోపాల్ రెడ్డి దే.ప్రభుత్వం పెట్టిన సన్న బియ్యం పథకం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన పెద్ది కృష్ణమూర్తి గౌడ్

**దేవరుప్పల, విశాలభారతి:**

మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆకుల వెంకటయ్యఅంజమ్మ దంపతుల కుమారుడు ఆకుల సందీప్‌స్వాతి వివాహం మండలకేంద్రంలోని తిరుమల గార్డెన్ లో జరుగగా ఆ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరుప్పుల పిఏసిఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్.*ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల సాయి ప్రకాష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుకూరి నర్సయ్య, చింత ఎల్లయ్య, తోటకూరి రమేష్, గోడిశాల శ్రీనివాస్, కారుపోతుల యాకస్వామి, పత్తేపురం శేఖర్, కారుపోతుల సతీష్, కారుపోతుల సురేష్, పల్సం వెంకటేష్,ఉప్పుల సిద్ధు, చింత పవన్ పాల్గొన్నారు.



## అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ఆహ్వానం

**దేవరుప్పల, విశాలభారతి:**

ప్రపంచ మేధావి, గొప్ప విద్యావేత్త, దళితుల ఆశాజ్యోతి, అందరివాడు, నవభారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి నూతన కాంస్య విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం ఏప్రిల్ 14 సోమవారం ఉదయం 9:00 గంటలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని దేవరుప్పుల మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తా ప్రాంగణంలో దేవరుప్పుల అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ ఆధ్వర్యంలో కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపన కమిటీ అధ్యక్షులు భాషిపాక యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతిష్టాపన దాతలు మండలంలోని ప్రతి గ్రామం నుండి పలువురు ముఖ్య నాయకులకు దళిత నాయకులు బహుజనులు మేధావులు విద్యావేత్తలు బడుగు బలహీనవర్గాల నేతలు అంబేద్కర్ వాదులు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయగలరని కోరుతున్నాము.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**దేవరుప్పల, విశాలభారతి:**

మండల కేంద్రంలోని జరిగిన వివాహోత్సవాలలో పాల్గొన్న మాజీ మంత్రి దయాకర్ రావు ఇందులో భాగంగా నీర్మాల గ్రామ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్నం చంద్రమౌళి కుమారుడు గణేష్ పుష్పలత వివాహ మహోత్సవం వడిచర్ల గ్రామంలోని నక్షత్ర గార్డెన్స్ లో జరుగగా ఆ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వధించిన మాజీ మంత్రి,బిఆర్ఎస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ కార్యక్రమంలో జిల్లా బిఆర్ఎస్ నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, మాజీ ఎంపిపి బస్వ సావిత్రి మల్లేశం,మండల అధ్యక్ష కార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్, చింత రవి, నియోజక వర్గ యూత్ అధ్యక్షుడు గడ్డం రాజు, నర్సిరెడ్డి, యాదగిరి, సత్తయ్య,మండల, గ్రామ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## వనజీవి రామయ్యకి ఘన నివాళి

**నేరేడుచర్ల, విశాలభారతి:**

లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ప్రముఖ వనజీవి దరపల్లి రామయ్య కి ఘనంగా నివాళులు అర్పించడమైంది.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ జిలకర రామస్వామి జోన్ చైర్మన్ లయన్ చల్లా ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ – "రామయ్య తన జీవితం అంతా ప్రకృతి పరిరక్షణకు అంకితమవుతూ లక్షలాది మొక్కలు నాటి మన సమాజానికి స్ఫూర్తిగా నిలిచారు. మనం కూడా ఆయన మార్గాన్ని అనుసరిస్తూ ప్రతి ఒక్కరం మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. అప్పుడు మాత్రమే కాలుష్యం తగ్గి జీవన విధానంపై మెరుగైన ప్రభావం పడుతుంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ బట్టు మధు, క్లబ్ కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, క్లబ్ కోశాధికారి షేక్ యూసుఫ్, యడవల్లి సత్యనారాయణ రెడ్డి, సుంకర క్రాంతి కుమార్,శ్రీనివాస్ , సుబ్బారావు, జంగయ్య, బాజీ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.




## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కోదాడ, విశాలభారతి:**

మండల పరిధిలోని కాపుగల్లు ప్రాథమిక పాఠశాల 25 సంవత్సరాల జ్ఞాపకాలు నెమరు వేసుకున్న పూర్వ విద్యార్థులు. కాపుగల్లు జడ్పిహెచ్ఎస్ లో 1999 2000 బ్యాచ్ 25 సంవత్సరాల తర్వాత తమ గత స్మృతులను నెమరువేసుకునుటకు ఆదివారం గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కడెక్కడో వివిధ రంగాలలో వివిధ హోదాలలో స్థిరపడిన విద్యార్థులంతా ఒక గ్రూపుగా ఏర్పడి తమ చదువుకున్న పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకొని అప్పటి తమకు బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించి వారి చేత మరల పాఠాలు బోధించుకున్నట్లు క్లాస్ రూమ్ లో చేసిన విద్యార్థులు మధురస్మృతులను గుర్తుచేసుకొని ఆనందించారు. తమను క్రమశిక్షణలో పెట్టడానికి తమ విద్యార్థులు దండించిన విధానాన్ని సమాజానికి సేవ చేసే విషయంలో వాళ్ళు ఇచ్చిన స్ఫూర్తిని ఇప్పటికీ నాయకుడిగా వివిధ హోదాలలో ఉన్న వ్యక్తులుగా వాటిని నెరవేరుస్తున్నట్లు గుర్తు చేసుకుంటూ సాగిన ఈ కార్యక్రమం కొన్ని సరదా ఆటలతో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులంతా తమ ఉపాధ్యాయులను సత్కరించి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషాచారి, వీరయ్య, సత్యం, మధుసూదన్ రావు, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కురిసిన వర్షం తడిసిన ధాన్యం

**తిరుమలగిరి, విశాలభారతి:**



మండలం తొండ గ్రామంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ఐకెపి సెంటర్లో ఉంచిన ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభమై నాలుగు రోజులైనా నేటికీ కాంటాలు కాకపోవడంతో ధాన్యం నిలువలు ఎక్కువగా ఉన్నవి. దీంతో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది . రైతులు కన్నీటి పర్యంతం అయినారు. రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే నేటికీ కాంటాలు మొదలు కాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రైతులు ఇప్పటికైనా తక్షణమే కాంటాలు మొదలుపెట్టాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.



## తెలంగాణ, చతిస్గడ్ రాష్ట్రాల సరిహద్దులో బీరమయ్య జన జాతర

**వాజేడు, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర సరిహద్దున లొట్టా పేట గండి వద్ద వెలసిన శ్రీ బీరమయ్య జాతర వైభవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర, చత్తీస్గడ్ మరియు మహారాష్ట్ర సరిహద్దుల్లో వెలసిన శ్రీ బీరమ్మయ్య (భీష్మ శంకరుడు ) మహా జాతర శనివారం వాజేడు మండలం పరిధి టేకులగూడెం గ్రామపంచాయతీ, మరియు కృష్ణాపురం గ్రామపంచాయతీ కడేకల్ గ్రామంలనుండి ప్రారంభమై.. లక్ష్మీ దేవార అమ్మవారిని పూజించి బీరమ్మయ్య గుట్టకు తీసుకెళ్తారు. శనివారం రాత్రి అంతా గిరిజన సాంప్రదాయం నృత్యాలతో భక్తులు జాగారం చేస్తారు. తెల్లవారు జామున నాలుగు గంటల పవిత్ర గోదావరి స్నానం స్వామివారికి చేయించి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ఉదయం నుండి భక్తులు అనేక సంఖ్యలో పాల్గొన్నారు. కోరిన కోర్కెలు నెరవేర్చిన భక్తులు భీష్మ శంకరునికి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర వీక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర మరియు చతిస్గడ్ రాష్ట్ర నుండి వచ్చిన భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా మంచినీరు మరియు వైద్య సౌకర్యాలు, బీరమయ్య జాతర కమిటీ సభ్యులు సౌకర్యాలు కల్పించారు.



## పచ్చిపాల రామకృష్ణ యాదవ్‌కు బీపీ మండల్ అవార్డు

**కోదాడ, విశాలభారతి:**

బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో హైదరాబాదులోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో ఆదివారం నాడు జరిగిన బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందెశ్వర్ మండల్ ప్రసాద్ (బీపీ మండల్) అవార్డులను సామాజిక సేవ ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తించి రాష్ట్రస్థాయిలో అవార్డులను ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు, బోడె రామచంద్ర యాదవ్ బిపి మండల్ మనవడు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ అవార్డు గ్రహీత బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ను సన్మానించి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల వారికి బీపీ మండల్ ఎంతో సేవ చేశారని వారికి గుర్తింపుగా బీపీ మండల అవార్డు ప్రకటించడం హర్షణీయమని అన్నారు. అవార్డు గ్రహీత రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజం పట్ల సేవా దృక్పథంతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు వట్టె జానయ్య యాదవ్, చిన్న శ్రీశైలం యాదవ్, బేరి రామచందర్ గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నీలి ర్యాలీని విజయవంతం చేద్దాం

▸ **వగ్గు మహేష్**

**ఆమనగల్లు, విశాలభారతి :**



భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబెద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలనీ, జయంతి వేడుకల సందర్భంగా నీలి జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అమనగల్లు అంబేద్కర్ యువజన సంఘము అధ్యక్షులు వగ్గు మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా జయంతి కమిటి సభ్యులతో కలిసి వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 14వ తేదీన బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి మండల కేంద్రములో ఘనంగా నిర్వహించడం జరిగుతుందని అందువలన బాబాసాహెబ్ అభిమానులు ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొని జయంతిని విజయవంతం చేయాలని కోరారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
14.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహాల శుద్ధి

- జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి.



ఎల్బీనగర్ ,విశాలభారతి: డా" బి.ఆర్ అంబేద్కర్ జయంతి నేపథ్యంలో ఎల్బీనగర్ అండర్పాస్ రోడ్ సమీపంలో ఉన్న డా" బి.ఆర్ అంబేద్కర్ & బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి నేతృత్వంలో ముఖ్య అతిథులుగా బిజెపి నాయకురాలు రాణీ రుద్రమదేవి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, బిజెపి కార్యకర్తలతో కలిసి విగ్రహాలను నీటితో కడిగి శుద్ధి చేస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహాలను శుభ్రం చేసి సాయంత్రం దీపాలతోటి విగ్రహాలను అలంకరించి, దేశవ్యాప్తంగా వాడవాడల జయంతి ఉత్సాహాలు నిర్వహించాలని, ఆయన రాసినటువంటి రాజ్యాంగ ప్రీతికను చదివి భారతీయులుగా భారత రాజ్యాంగాన్ని పాటిస్తామని ప్రమాణం చేసే స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బండారి భాస్కర్, మునగాల హరీష్ రెడ్డి, గుండె కిరణ్ కుమార్, నరేష్ యాదవ్, యంజాల జగన్, భీమనపల్లి సిద్దు తదితరులు పాల్గొన్నారు.



## 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్స్ ని రెగ్యులరైజేషన్ చేయాలి

- కాంట్రాక్టు అధ్యాపకులు

విశాలభారతి, ఓయూ: తెలంగాణ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజేషన్ చేయాలనీ గత వారంరోజులుగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తున్నప్పటికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి హామీ ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరి తీరు తో అన్ని యూనివర్సిటీ లలో ఉద్యమాలను ఉదృతం చేస్తున్నట్లు ఆదివారం ఓయూ లో ఏర్పాటు చేసిన యూనివర్సిటీ ల ప్రతినిధులు ఉస్మానియా యూనివర్సిటీ లో సమావేశం ఏర్పాటు చేసుకొని భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. ఈ నెల 15 నుండి నిరవధిక సమ్మెకు నోటీసు ఇచ్చి యూనివర్సిటీ లలో ధర్నా కార్యక్రమాలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ధర్మతేజ (ఓయూ), డాక్టర్ వేల్పులకుమార్ (ఓయూ), డాక్టర్ ఉపేందర్(ఐలమ్మ. యు), డాక్టర్ విజేందర్ రెడ్డి(ఓయూ) , డాక్టర్ చిర్రరాజు(కెయు), డాక్టర్ తాళపల్లి వెంకటేష్ (ఓయూ), డాక్టర్ రమేశ్వర్(ఓయూ), డాక్టర్ శ్రీధర్ రెడ్డి (పి.యు), డాక్టర్ సురేష్ నాయక్(జె యేన్ టి యు), డాక్టర్ నారాయణగుప్తా(టి. యు), డాక్టర్ ఓ. కృష్ణయ్య(ఓయూ),డాక్టర్ సి హెచ్ వెంకటేష్(ఓయూ). పాల్గొన్నారు.




## మహనీయులు స్ఫూర్తితో సాగుతం

- మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలభారతి,ఓయూ: నాలుగు రోజులుగా ఓయూలో జరుగుతున్న మహనీయులు జయంత్యుత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ముగింపు ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంక్షేమశాఖా మాత్యులు పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు మహనీయుల జీవితాలు, వారు చూపిన మార్గాలపై లోతైన చర్చ సహా వివిధ కార్యక్రమాలు చేసిన ఓయూ చొరవను ప్రశంసించారు. మహాత్మా జ్యోతిబాపూలే, జగ్జీవన్ రామ్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ల జీవితం, వారు నడిచిన మార్గం పై విశ్వవిద్యాలయాలు అధ్యయనం చేయాలని కోరారు. ప్రొఫెసర్ కుమార్ నాయకత్వంలో ఓయూలో జరుగుతున్న ఈ వేడుకల్లో పాల్గొనటం ఆనందంగా ఉందని అన్నారు. సామాజిక మార్పుకు కారణమైన బాబు జగ్జీవన్ రామ్ ,జ్యోతిబా పూలే, అంబేద్కర్ లు జన్మించిన ఏప్రిల్ నెల మహనీయులు ఇచ్చిన సామాజిక స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ, 42శాతం రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తోసుకొచ్చిందని గుర్తు చేశారు. కొన్ని అడ్డంకుల వల్ల జాబ్ క్యాలెండర్ ఆలస్యమైందని. ఇవాళో రేపో జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. మహనీయులు చూపిన మార్గాన్ని భవిష్యత్తు తరాలకు అందించాలని. అందుకోసం లోతైన తర్చ, మేధోమధనం జరగాలని ఆకాంక్షించారు. విద్యార్థి నాయకుడిగా, యువజన నాయకుడిగా విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘ ఎన్నికలు ఉండాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయాల నుంచి పరిపక్వత కలిగిన భవిష్యత్తు నాయకత్వం ఎన్నికల ద్వారానే సాధ్యమని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల అభ్యున్నతి, ఉద్యోగ కల్పన, నైపుణ్యాల అభివృద్ధి తోనే తెలంగాణ రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధ్యమన్న పొన్నం ప్రభాకర్ ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సెల్స్ తో పాటు యూజీసీ వ్యవహారాల డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన జయంతి ఉత్సావాలు విజయవంతం కావటం పల్ల ఓయూ అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల పాటు కార్యక్రమాలను రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితెందర్ కుమార్ నాయక్ పర్యవేక్షించారు. ప్రొ. బి. లావణ్య ప్రొ. ఐ. డైసీ, ప్రొ. పి. విష్ణుదేవ్, ప్రొ. బి. మంగు కన్వీనర్లుగా వ్యవహరించారు. కో కన్వీనర్లుగా డాక్టర్. భీణవేణి రాంషపర్డ్, డాక్టర్ జి. ఉపెందర్, డాక్టర్ ఎ. అనుపమ, ప్రొఫెసర్ బి. రాజెంద్రనాయక్, డాక్టర్ జి. శ్రీనివాసరావు, డాక్టర్ వై కళ్యాణలక్ష్మి, ప్రొ. ఇ. విద్యాసాగర్, పాల్గొన్నారు.

## ఐక్యంగా హక్కులు సాధించుకుందాం

ఖైరతాబాద్,విశాలభారతి:ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణనలో మున్నూరు కాపుల సంఖ్య తగ్గినట్లు చూపించడం విచారకరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మున్నూరు కాపులంతా ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మున్నూరుకాపు సంఘం, మున్నూరుకాపు గర్జన కార్యాచరణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో 'దశా.. దిశా' ఆత్మీయ సమావేశం జరిగింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, డాక్టర్ కె.లక్ష్మణ్ తదితరులు జ్యోతి వెలిగించి సమావేశాన్ని ప్రారంభించారు. కేశవరావు మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర కులగణన సక్రమంగా చేపట్టినా కొన్ని పొరపాట్లు జరిగాయని, వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఉత్తరాదిలో బీసీలు ఎటు మొగ్గితే ఆ పార్టీనే అధికారంలోకి వస్తోందని డా.లక్ష్మణ్ అన్నారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ బీసీలకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్నను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని మండిపడ్డారు.





## అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రామేశ్వరంబండలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ
- అతి త్వరలో సొంత నిధులతో అంబేద్కర్ భవన నిర్మాణం

పటాన్ చెరు,విశాలభారతి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు, ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కంకణబద్దులు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం రామేశ్వరంబండ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ అంతిరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే మహిపాల్ తన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తన జీవితాన్ని బడుగు బలహీన వర్గాలకు అంకితం చేసిన గొప్ప నాయకుడు డాక్టర్ అంబేద్కర్ అని తెలిపారు. కార్మికులకు కనీస వేతనాలు, సమాన హక్కులు, పరిపాలన వికేంద్రీకరణ, చిన్న రాష్ట్రాలు, పరిపాలనలో మహిళలకు 50% రిజర్వేషన్లు, తదితర మహోన్నత నిర్ణయాలు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారానే తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఆయన స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలన్న లక్ష్యంతో.. నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు.. 20 లక్షల రూపాయల సొంత నిధులతో అంబేద్కర్ భవనం నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల తాను లండన్ వెళ్లినప్పుడు అంబేద్కర్ విద్యను అభ్యసించిన కళాశాలను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. యువత అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ధరణి అంతి రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, ఆంజనేయులు, నగేష్, శంకర్, సురేష్, ఇబ్రహీం, అర్జున్, కిరణ్, రమేష్, దానయ్య, నవీన్, సర్దార్, సాయిలు, రాములు, లోకేష్, దశరథ్, యాదమ్మ, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్ కాలనీలో ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు



పెద్ద అంబర్ పేట్, విశాలభారతి: పెద్ద అంబర్పేట్ 4వ వార్డులోని శాంతినగర్ కాలనీలో క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు, యూత్ సభ్యులు ఈత మట్టలను ప్రత్యేకంగా రకరకాల పూలతో అలంకరించి చర్చి నుంచి బయలుదేరి కాలనీ మొత్తం ఊరేగింపుగా తిరుగుతూ దేవుని స్తుతిస్తూ, పాటలు పాడుతూ దేవుని మహిమ పరిచి తిరిగి చర్చికి చేరుకున్నారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యువతి, యువకులు ప్రత్యేక గీతాలు ఆలపించారు.ఈ సందర్భంగా పాస్టర్ సిల్వధర్ ఏసుక్రీస్తు పునరుద్దానం గురించి వివరించారు. ఏసుక్రీస్తు పునరుత్థాన పండుగను(ఈస్టర్) పురస్కరించుకుని ఆయన అనుభవించిన శ్రమదినాలకు గుర్తుగా 40 రోజులపాటు క్రైస్తవులంతా ఉపవాసంలోను, దానధర్మంలోను పాల్గొంటారన్నారు. యేసుక్రీస్తు యెరుషలేములోకి ప్రవేశించిన రోజున మట్టలను అలంకరించి ఆయనకు స్వాగతం పలుకుతారని, ఈ నేపథ్యంలో మట్టల ఆదివారం నిర్వహిస్తారని పాస్టర్ సిల్వధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సామేల్, ఎలీషా రాజు, డొమినిక్, మల్కన్న, సిహెచ్. రమేష్, మల్లయ్య, దినకర్, నాగరాజు, దేవదాసు, జాకోబ్, రమేష్, అమృత, ఫ్రూటీ, శోభ, లీల, సండే స్కూల్ పిల్లలు, యూత్ సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## సంఘం సత్తయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

- యువతకోసం చేసిన సేవలు మరువలేనివి
- జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ స్థాపించి యువకులకు యూత్ ఐకాన్ గా నిలిచారు
- యూత్ ఆవరణలో సంఘం సత్తయ్య విగ్రహం ఆవిష్కరణ
- ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, విశాలభారతి : సంఘం సత్తయ్యను ఆదర్శంగా తీసుకొని ఆయన చూపిన బాటలో నడవాలని ఇబ్రహీంపట్నం శాసన సభ సభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలో జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ వ్యవస్థపకుడు , అడ్వకేట్ సంఘం సత్తయ్య గత కొన్ని రోజుల క్రితం మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థంగా యూత్ ఆవరణలో విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్య గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్తయ్య చేసిన సేవలు భవిష్యత్ తరాలకు అందించవలసిన అవసరం ఉందన్నారు. ఆయన ఆశయాలకు పునరంకితం కావడమే ఆయనకు అందించే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు, యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు , శ్రీనివాస్ రెడ్డి , ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, బీఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్ర శేఖర్ రెడ్డి, నాయకులు ముడేడ్ల వెంకట్ రెడ్డి , మహిపాల్ ,యూత్ సీనియర్ సభ్యులు బ్రహ్మాచారి, పాండరి,రవీంద్ర చారి , యాదయ్య గౌడ్, గోపాల్ రావు , ప్రవీణ్ కుమార్, వెంకటేశం,చారి , శేఖర్ రెడ్డి,మోహన్ రెడ్డి,కుమార్ , నరేందర్ రావు,పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు...

## ఐక్యత పోరాటాల ద్వారానే హక్కులు సాధ్యం

- 40 సంవత్సరాల నుంచి ఒకే యూనియన్ ఉండటం చారిత్రాత్మకం
- శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ అధ్యక్షులు, నవ తెలంగాణ పత్రిక సంపాదకులు ఆర్.సుధాభాస్కర్
- ఘనంగా శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40వ వార్షికోత్సవ వేడుకలు






పటాన్ చెరు,విశాలభారతి : ఐక్యత పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకోవడం జరుగుతుందని, 40 సంవత్సరాల నుండి ఒకే యూనియన్ ఉండటం చారిత్రాత్మకమని శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ అధ్యక్షులు, నవ తెలంగాణ పత్రిక సంపాదకులు ఆర్.సుధాభాస్కర్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలో గల శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ (పూర్వపు విడియా ఎంప్లాయిస్ యూనియన్) స్థాపించి 40 సం॥ పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మండలంలోని కర్దనూర్ లోని జేపీ కన్వెన్షన్ హాల్లో ఘనంగా జరిగిన శాండ్విక్ 40వ వార్షికోత్సవ వేడుకల్లో ఆర్.సుధాభాస్కర్, యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్. కృపేందర్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుధాభాస్కర్ మాట్లాడుతూ 40 సం। గా కార్మిక సంక్షేమంలో రాజీలేకుండా ఒకే నాయకత్వంలో 40 సం॥ పూర్తి చేసుకోవడం ఎంతో అభినందనీయమని అన్నారు. గత కొన్ని రోజులుగా ప్రపంచ పరిణామాలు గమనిస్తే అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చాక తీసుకుంటున్న నిర్ణయాలు టారిఫ్ యుద్ధం వల్ల ప్రపంచ వాణిజ్యంలో తీవ్ర పరిణామాలు చోటు చేసుకున్నాయని చెప్పారు. దీని ప్రభావం పరిశ్రమలతో పాటు కార్మికవర్గం మీద పడుతుందన్నారు. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్. కృపేందర్ మాట్లాడుతూ 1985వ సంవత్సరంలో చాలా కష్టంతో యూనియన్ ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు నుంచి ఎన్ని యాజమాన్యాలు మారినా, ఒకే యూనియన్ 40వ వార్షికోత్సవం నిర్వహించుకోవడం చరిత్ర అన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ 1985 ఏప్రిల్ 9న స్థాపించిన విడియా ఎంప్లాయిస్ యూనియన్ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటూ అనేక యాజమాన్యాలు మారి నేడు శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ గా 40 సం॥ పూర్తిచేసుకుని 40వ వార్షికోత్సవం నిర్వహించుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రారంభం నుండి కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా సీఐటీయూ మార్గనిర్దేశకత్వంలో కార్మికులనందరిని ఐక్యంగా నిలబెట్టడం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జే మల్లికార్జున్, సిపిఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు బీరం మల్లేశం, ఉపాధ్యక్షులు కే. రాజయ్య, శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పి. పాండురంగారెడ్డి, మనోహర్, వెంకట్రావు, సదాశివరెడ్డి, విటల్ రావు,శాండ్విక్ ప్లాంట్ హెడ్ అభిజిత్ హడప్, వైస్ ప్రెసిడెంట్ జయప్రకాష్, హెచ్ఆర్ హెడ్ నాగవేణి బాజ్పాయి, మాజీ హెచ్ఆర్ హెడ్స్, మాజీ మనేజర్స్, పరిశ్రమ ప్రతినిధులు, వివిధ పరిశ్రమల సీఐటీయూ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువవికాస్ దరఖాస్తు తేదీని పొడిగించాలి

- యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి



**శాలిగౌరారం, విశాలభారతి:** నల్గొండ జిల్లా శాలిగౌరారం రాష్ట్రంలో ఎస్సీ ,ఎస్టీ,బీసీ మైనారిటీ పేదలకు ఆర్థిక భరోసా కల్పించే దృష్టితో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాస్ పథకానికి అప్లై చేసుకునేందుకు దరఖాస్తు తేదీని ఈ నెల చివరివరకు పొడిగించాలని తుంగతుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల. గోపీనాథ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం గోపీనాథ్ మాట్లాడుతూ శని,అది సోమవారాలు సెలవులు కావడం, సైట్ ఓపెన్ కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని,అప్లై చేసిన దరఖాస్తులు సైతం సెలవు కావడంతో సమర్పిచలేకపోయారన్నారు. అనేక రోజులుగా కులం ఆదాయ సర్టిఫికెట్ కొరకు సెలవులు కారణంగా ఈ పథకానికి అప్లై చేసుకోవడంకష్టం గా వున్నదన్నారు. దాని కోసం ఎదురు చూస్తున్న సైట్ మొరాయించటం సర్వర్ బిజీ వల్ల అతి కొద్ది మందికి మాత్రమే అవకాశం కాంగ్రెస్ ప్రభుత్వం పునరఆలోచన చేసి తేదిని పొడిగించాలన్నారు. ఏవైనా సర్టిఫికెట్ లేకపోయినా తర్వాత ఎడిట్ ఆప్షన్ ఇచ్చి అప్డేట్ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. రెవెన్యూ అధికారుల సైతం కుల ఆదాయ సర్టిఫికెట్ లని త్వరగా దరఖాస్తుదారులకు అందించాలన్నారు.

# అమరుల త్యాగాలతో ఎర్రజెండా మరింత ఏరుపెక్కుతుంది

- బూటకపు ఎన్కౌంటర్ల పేరుతో హత్యలు
- పేదరికం ఉన్నన్ని రోజులు మావోయిస్టులు ఉంటారు



**భీమదేవరపల్లి, విశాలభారతి:** అభివృద్ధి పేరిట అడవులను విద్వాంసం చేస్తూ, మావోయిస్టులనే నేపంతో ఆదివాసులను హత్యలు చేస్తూ, చంపి వేస్తున్నారని రాష్ట్ర బంధు మిత్రుల సంఘం నాయకురాలు శాంతక్క అన్నారు. వంగర గ్రామంలో జరిగిన కషావేన రవి ప్రథమ వర్ధంతి సందర్భంగా మాట్లాడుతూ, భూమికోసం, భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం పోరాడుతున్న వారిని బూటక పు ఎన్కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తున్నారని అన్నారు. పేదరికం ఉన్నన్ని రోజులు మావోయిస్టులు ఉంటారని ఆమె అన్నారు. ఆదివాసుల కాళ్ళ కింద ఉన్న 27 రకాల ఖనిజ సంపదను ఆదాని, అంబానీలకు అందజేసేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని ఆవేశం వ్యక్తం చేశారు. నాడు గ్రామాలలో భూస్వామ్య వ్యవస్థను లేకుండా చేసిన ఉద్యమకారులు, రానున్న రోజులో ఈ దోపిడి వ్యవస్థను తుద ముట్టిస్తారని ఆమె అన్నారు. అమరుల త్యాగాలతో ఎర్రజెండా మరింత ఎరుపెక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రుల సంఘం నాయకులు, విప్లవ రచయితల సంఘం బాలసాని రాజయ్య, పౌర హక్కుల సంఘం నాయకులు సంజీవ్, ప్రజాఫ్రంట్ నాయకులు ఆముదాల అంజన్న, శేఖర్, కుమార స్వామి, కార్మిక నాయకులు రాజన్న, సదయ్య, బంధువులు, మిత్రులు గ్రామస్తులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

- పోలీసుల అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించవద్దు
- ప్రభల పేరిట అసభ్యకర నృత్యాలు ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవు
- జిల్లాలో డీజే లు పూర్తిగా నిషేదం
- సూర్యాపేట జిల్లా ఎస్పీ



**సూర్యాపేట, విశాలభారతి:** ప్రజల భద్రత, శాంతిభద్రతల దృష్ట్యా సూర్యాపేట జిల్లాలో 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్నదని, పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదని, కచ్చితంగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, అనుమతులు లేకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ నర్సింహ ఐపీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా డీజే లను పూర్తిగా నిషేధించడం జరిగినదని, పండుగలు, పెండ్లిల్లు, ఇతర సందర్భాలలో డీజేలు ఉపయోగించవద్దని తెలిపారు. పోలీసు నిభందనలు పాటించకుండా డీజే లు ఉపయోగిస్తే డీజే యజమానులపై, కార్యక్రమం నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని వెల్లడించారు. ప్రభలు నిషేధం, పండుగలు, సాంప్రదాయ ఉత్సవాలు జరిగేటప్పుడు ప్రభల, డాన్స్ ప్రోగ్రామ్ లంటు అశ్లీల నృత్యాలు, అసభ్యకరమైన డాన్సులు ప్రదర్శిస్తే నిర్వాహకులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




# ఘనంగా పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సమ్మేళనం

- 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**సూర్యాపేట, విశాలభారతి:** 50 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలుసుకొని ఘనంగా స్వర్ణోత్సవ సమ్మేళనం నిర్వహించారు. సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల లో 197375 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ బైపిసి కి చెందిన పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత కలుసుకొని తమ చిన్న నాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. జూనియర్ కళాశాల 50 ఏళ్ల క్రితం చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని సరదాగా గడిపారు. ఒకరినొకరు తమ బాగోగులు తెలుసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమా నికి హాజరైన పూర్వ విద్యార్థి, సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ వర్దెల్లి మురళి మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం చదువుకున్న తాము ఈ వయసులో కలుకోవడం పునరుత్తేజాన్ని ఇచ్చిందన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శంకర్, శ్యాంసుందర్, అశోక్, ఉప్పల రాజేంద్రప్రసాద్, నరేందర్ రెడ్డి, పిచ్చిరెడ్డి, రంగారెడ్డి, అశ్విని కుమార్, నరసింహారావు, డాక్టర్ రామచంద్రరావు, జగన్, పృథ్వీ రంజన్ రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
14.04.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





vishalabharathi Telugu Daily


## అంబేద్కర్ విగ్రహం శుద్ధి



**సికింద్రాబాద్,విశాలభారతి :** సీతాఫల్మండి అంబేద్కర్ విగ్రహానికి పాలతో అభిషేకం చేసి పూలమాలతో కేంద్ర మంత్రి గంగపురం కిషన్ రెడ్డి అలంకరించారు.అనంతరం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరత్ గౌడ్, మేకల సారంగపాణి బండ కార్తీక్ రెడ్డి,రాచమల్ల కృష్ణమూర్తి,నాగేశ్వర్ రెడ్డి, హరి అంబాల రాజేశ్వరరావు, మేకల కీర్తి కిరణ్, శారద,నరేష్, భాస్కర్ గిరి, విద్యాసాగర్, గరికపాటి చంద్రశేఖర్, గడ్డం ప్రసాద్ పాల్గొన్నారు.



# రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు కొరకు ఐక్యంగా పోరాడుదాం




**సూర్యాపేట, విశాలభారతి:** లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ సామాజిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి పెంచెందుకు జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20 జరిగే దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెకు రవాణా రంగ కార్మికులు సన్నద్ధం కావాలని తెలంగాణ పబ్లిక్ &ప్రైవేట్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ అనుబంధం) సూర్యాపేట జిల్లా కార్యదర్శి యం. రాంబాబు. కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ జిల్లా కమిటీ సమావేశం సట్టు యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ..24 గంటలు సరుకులను, ప్రయాణికులను చేర వేయటంలో రవాణా కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నా, వారి ప్రాణాలకు భద్రత లేదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు భారీ గా తగ్గినా మన దేశం లో పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా పెంచిందని అన్నారు.జాతీయ రహదారులపై రవాణా కార్మికులకు వసతులతో కూడి న సదుపాయాలు ఏర్పాటు చెయ్యాలని అన్నారు. ప్రమాదాల నియంత్రణ కొరకు రోడ్ల విస్తరణ, రోడ్ల విభజన జరగాలన్నారు. మే 20సమ్మె జయప్రదానికి కార్మిక వర్గంలో విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. ఈ సమావేశం లో జిల్లా నాయకులు వజ్జ సైదయ్య, జూలకంటి కిషోర్ కుమార్, బి. సుధాకర్, జి. రమేష్, వి. లక్ష్మన్,బి. శ్రీకంట్లం ఆర్. శ్రీనివాస రెడ్డి, సత్యనారాయణ, లింగయ్య, కరీం, రవి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.



# 24 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వపు విద్యార్థులు

**ఆమనగల్లు, విశాలభారతి:** ఆనందం, ఉద్వేగం,ఆప్యాయత పలకరింపులు చిన్ననాటి జ్ఞాపకాలు చిలిపి ముచ్చట్లు సెల్ఫీలు మధురమైన జ్ఞాపకాలతో ఆ ప్రాంతమంతా సందడిగా నెలకొంది. 24 ఏళ్ల తర్వాత బాల్యమిత్రులు ఒకచోట కలుసుకోవడం చెప్పుకోలేని మధుర అనుభవం. అమనగల్లు మండల పరిధిలోని నలంద విద్యాలయం లో పదోవ తరగతి 2001 2002 బ్యాచ్ విద్యార్థులు 24 సంవత్సరాల తర్వాత ఆదివారం ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బి ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకోవడంతో వారి సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి.ఈ సందర్భంగా విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఉన్నత చదువుల కోసం దూరమయ్యారు. మళ్లీ ఇన్నేండ్ల తర్వాత కలుసుకున్నారు. ఆ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి, అలనాటి స్మృతులను నెమరేసుకుంటూ ఒకరిని ఒకరు ఆటపట్టిస్తూ యోగక్షేమాలు తెలుసుకుంటూ రోజంతా సరదాగా గడిపారు. పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, రెండు దశాబ్దాలు గడిచిన అందరు స్నేహితులు కలువాలనే ఉద్దేశంతో ఆత్మీయ సమ్మేళన వేదిక ఏర్పాటు చేసినట్లు విద్యార్థులు తెలిపారు. 24 సంవత్సరాల క్రితం పదవ తరగతి పరీక్షలు వ్రాసి కొందరు పై చదువుల కొరకు వేరువేరు పట్టణాలకు, మరికొందరు జీవనాధారం కోసం ఏదో పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కొందరు ఉన్నత విద్యను అభ్యసించి మంచి ఉద్యోగం చేస్తున్నారు. మరికొందరు వ్యాపార రంగాల్లో స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. మరికొందరు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చాలా సంవత్సరాల తర్వాత దాదాపు అందరూ స్నేహితులు కలవడం చాలా ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాడు బోధించిన ఉపాధ్యాయులు సుదీర్ రెడ్డి, బాలిశ్వర్ శేఖర్, వందన,శాంత,ఉమాపతి గౌడ్ హాజరై పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.శరత్, శేఖర్, జిలాని, యాదయ్య, జగన్, రాఘవ, వెంకటేష్, సంధ్య, చందన, సత్యవేణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఎస్వీ డిగ్రీ కళాశాల తొలి సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- 54 యేళ్ళ తరువాత వృద్ధాప్యంలో కలుసుకున్న ఆనాటి విద్యార్థులు

**సూర్యాపేట, విశాలభారతి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలను ప్రారంభించిన 1971 సంవత్సరంలో 197174సంవత్సరంలో బిఎ బికామ్ విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు అధ్యాపకులుగా, ప్రిన్సిపల్ గా పని చేసి పదవి విరమణ పొందిన బి. విశ్వనాథంను పూర్వ విద్యార్థులంతా కలసి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో మొదటి బ్యాచ్ మాదేనని 78 యేళ్ళ వయసులో మా మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ బ్యాచ్లో మొత్తం 35 మంది విద్యార్థులం చదువుకోగా ఈ కార్యక్రమానికి 19మంది మాత్రమే హాజరయ్యామని అందులో 12 మంది కుటుంబంతో కలసి వచ్చినట్లు తెలిపారు. సుమారు 54 యేళ్ళ తరువాత కలుసుకున్న పూర్వ మిత్రులతో ఆనాటి జ్ఞాపకాలను ఒకరికొకరు పంచుకొని సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.వెంకటేశులు, పదవి విరమణ చేసిన అధ్యాపకులు, ఆనాటి పూర్వ విద్యార్థులు ఎన్.బాల్రెడ్డి, ఎన్. పిచ్చిరెడ్డి, శేఖర్రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటరంగయ్య, క్రుపాకర్, అమ్రుతారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, జానకి రాంరెడ్డి, లింగారెడ్డి, కళావతి రామేశ్వర్రెడ్డి, యానాల సుదర్శన్రెడ్డి, మారం వెంకటరెడ్డిలు ఉన్నారు.



# ఘనంగా బేతెస్థ మట్టల ఆదివారపు పండుగ

- బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా
- బేతెస్థ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు

**సూర్యాపేట, విశాలభారతి:** ఖాసీంపేట 4వ వార్డు బేతెస్థ చర్చి నందు బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా ఆధ్వర్యంలో బేతెస్థ మట్టల ఆదివారపు పండుగ సందర్భంగా 1000 మంది క్రైస్తవ భక్తుల తో ఘనం గా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ పండుగనుద్దేశించి మాట్లాడుతూ మట్టల ఆదివారం, లేదా మ్రానికొమ్మల (పామ్ సండే) అనేది క్రిస్టియన కేదిలే విందు ,ఇది ఈస్టర్ ముందు ఆదివారం వస్తుందనీ . ఈ విందు జెరూసలేంలోకి క్రీస్తు విజయవంతమైన ప్రవేశాన్ని జ్ఞాపకం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి అజయ్, యడవెల్లి యేసుపాదం, పేతురు, మామిడి యాకోబు, మామిడి ఉపేందర్, కుంచం వెంకన్న, వల్లెపు సురేష్, చందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం

**ఆమనగల్లు, విశాలభారతి:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఆదేశాల మేరకు రాజ్యంగ పరిరక్షణ పాదయాత్ర లో భాగంగా.. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ రాజ్యంగా పరిరక్షణ కై గ్రామ గ్రామాన పాదయాత్ర చేపట్టారు. కడ్తాల్ మండల కేంద్రంలో జై బాపు, జై భీమ్ నినాదాలతో మారుమోగింది.జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రను టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు.వీధి వీధి గడప గడప తిరిగి ప్రజలతో జై బాపు జై భీం, జై సంవిధాన్ ఆవశ్యకత గురించి ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ పాలనలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం హక్కులను కాలరాస్తూ, మహాత్మా గాంధీ చూపిన అహింస, శాంతి సిద్ధంతాలను విస్మరిస్తుందన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేద్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ దేశానికి కుల,మతాలకతీతంగా అన్ని వర్గాలను అభివృద్ధి చేయడానికి ముందుకెళ్లిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజారాంజక పాలన అందిస్తూ ప్రజలు మెచ్చే విధంగా ప్రజా పాలన కొనసాగుతుందన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం లో ముఖ్యమంత్రి సహకారం తో వందల కోట్ల రూపాయల అభివృద్ధి చేశామన్నారు.ఈ కార్యక్రమం లో ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ యాట గీతా నరసింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, ఎఎంసి వైస్ చెర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ చేగురి వెంకటేష్ పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
సోమవారం, 14.04.2025 హైదరాబాద్


cinema updates





## రాజ్‌తరుణ్‌కు స్టార్ ట్యాగ్ కోరిన నిర్మాత

నటుడు రాజ్‌తరుణ్ కు స్టార్ ట్యాగ్ ఇవ్వాలని నిర్మాత ఎస్.కె.ఎన్ విజ్ఞప్తి చేశారు. 'పాంచ్‌మినార్' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో ఆ చిత్ర నిర్మాతలను కోరారు. ఈ సినిమా టైటిల్ రోల్స్‌లో రాజ్‌తరుణ్ పేరుకు ముందు 'స్పాంటేనియస్ స్టార్' అని పెట్టాలని, తదుపరి చిత్రాల నిర్మాతలూ దాన్ని కొనసాగించాలని మనసులో మాట బయటపెట్టారు. అతడి కామెడీ టైమింగ్ బాగుంటుందని అందుకే ఆ ట్యాగ్ ఇవ్వాలని పేర్కొన్నారు. దీనిపై రాజ్‌తరుణ్ స్పందిస్తూ.. 'మీరు ఏది చెబితే అదే ఫాలో అవుతా' అని నిర్మాతతో అన్నారు. రాజ్‌తరుణ్ హీరోగా దర్శకుడు రామ్ తెరకెక్కించిన చిత్రం 'పాంచ్ మినార్'. రాశీసింగ్ హీరోయిన్. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న సందర్భంగా టీజర్ విడుదల చేశారు.

"ఎప్పటి నుంచో దర్శకుడు మారుతి నన్ను ప్రోత్సహిస్తున్నారు. మా డైరెక్టర్ రామ్ కష్టం, విజన్ ఈ సినిమా విజయవంతం అవుతుందని నమ్మడానికి కారణం. బ్రహ్మాజీతో కలిసి నటించిన ప్రతి సన్నివేశం ఎన్నో జ్ఞాపకాలు పంచింది" అని రాజ్‌తరుణ్ గుర్తుచేసుకున్నారు. తక్కువ బడ్జెట్‌లోనే క్వాలిటీతో సినిమా తెరకెక్కించారని మారుతి.. చిత్ర బృందాన్ని కొనియాడారు. ఇలాంటి సినిమాలను ప్రోత్సహించాలని ప్రేక్షకులను కోరారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు సాయి రాజేశ్, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



## లేచి మళ్లీ నీ శక్తిని చూపించు

"మీ ప్రయాణాన్ని చూసేందుకు ప్రపంచం ఆసక్తిగా ఉంది" అంటున్నారు బాలీవుడ్ కథానాయకుడు అక్షయ్ కుమార్. మరి ఆయన ఏ విషయం గురించి చెబుతున్నారో తెలియాలంటే 'కేసరి 2: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్ వాలా బాగ్' సినిమా చూడాల్సిందే. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. చారిత్రక కథా నేపథ్యంలో కరణ్ సింగ్ త్యాగి రూపొందిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోని "ఓ షేరా.. తీర్ తే తాజ్" అనే మొదటి గీతాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. "ధైర్యాన్ని అనుభూతి చెందే సమయమిది" అనే వ్యాఖ్యను జోడించింది. "సింహం లేచి మళ్లీ నీ శక్తిని చూపించు.." అంటూ దేశభక్తి నేపథ్యంలో సాగుతున్న ఈ పాట సినీ ప్రియులను ఆకట్టుకుంటోంది. ఈ గీతానికి సంగ్తార్ సంగీతం సమకూర్చగా, సుఖ్వీందర్ అమృత్ సాహిత్యం అందించారు, మన్మోహన్ వారిస్ ఆలపించారు. కరణ్ జోహార్ నిర్మిస్తున్న ఈ సినిమాలో అనన్య పాండే, ఆర్. మాధవన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. జలియన్ వాలా బాగ్ ఊచకోత ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## పెళ్లెప్పుడు తమన్నా ?

'ఓదెల 2' సినిమాతో నటిగా తనలోని కొత్త కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు తమన్నా. శివశక్తిగా ఆమె నటించిన ఆ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్నారు. 'పెళ్లి ఎప్పుడు చేసుకోబోతున్నారు?' అని ఓ ఇంటర్వ్యూలో అడగ్గా.. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదన్నారు. కొంతకాలంగా ప్రేమలో ఉన్న నటుడు విజయ్ వర్మ- తమన్నాకు బ్రేకప్ అయిందంటూ బాలీవుడ్‌లో ఇటీవల వార్తలొచ్చిన సంగతి తెలిసిందే.ఆఫర్లు లేకపోవడంతో చిన్న సినిమాల్లో నటిస్తున్నారా? అన్న ప్రశ్నపై తమన్నా స్పందించారు. "నా దృష్టిలో చిన్న సినిమా, పెద్ద సినిమా అని ఉండదు. కంటెంట్ బాగుంటే పెద్ద సినిమా అవుతుంది. బాగోకపోతే చిన్న సినిమా అవుతుంది. కెరీర్ ప్రారంభంలో నేను నటించిన 'హ్యాపీడేస్' మూవీలో ఎనిమిది ప్రధాన పాత్రల్లో నేనొకదాన్ని. నాకు డ్యాన్స్ ఇష్టం కాబట్టి బాలీవుడ్ మూవీ 'స్త్రీ 2'లో ప్రత్యేక గీతంలో నటించా. కానీ, అది పెద్ద హిట్ అవుతుందని నేను ఊహించలేదు. ఏది ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనేది మనం చెప్పలేం" అని పేర్కొన్నారు. 'ఓదెల' సినిమాకి సీక్వెల్‌గా రూపొందిందే 'ఓదెల 2'. దుష్టశక్తుల నుంచి ఓదెల గ్రామాన్ని మల్లన్న స్వామి ఎలా రక్షించాడు? శివశక్తి ఏం చేసింది? తదితర అంశాలతో దర్శకుడు అశోక్ తేజ తెరకెక్కించారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.